# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 12

శనివారం, 1 నవంబర్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## రైతుల ఆదాయం పెంచేలా ఉపాధి పనులు

**రూ.1,372 కోట్లతో ప్రణాళిక: మంత్రి సీతక్క**



**హైదరాబాద్, నవంబరు 1:** రాష్ట్ర రైతుల ఆదాయం పెంచేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనుసూయ సీతక్క తెలిపారు. వ్యవసాయ - మిగతా 2వ పేజీలో

## 40% పెరిగిన డైట్, కాస్మెటిక్ చార్జీలు

**హైదరాబాద్:** సంక్షేమ వసతి గృహాలు, గురు కుల విద్యా సంస్థల్లోని విద్యార్థుల డైట్, కాస్మె టిక్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ గురువారం జారీ చేశారు. ఏడేళ్ల తర్వాత ఈ చార్జీలను 40శాతం మేర పెంచగా, ఇవి నవంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. చార్జీల పెంపు పట్ల మంత్రి సీతక్క, ఎంపీ మల్లు రవి, ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, ఎన్.శ్రీధర్ సీఎంని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



# తెరవెనుక ‘మంత్రాంగం’

- సీఎం రేవంత్‌పై మంత్రుల కుట్రనా?
- ఇప్పటికే ఓ మంత్రిపై తీవ్ర ఆరోపణలు..
- గవర్నర్ ను కలిసిన ఆ అమాత్యుడెవరు?
- ‘అధిష్టానం’ కోసం ఢిల్లీకి వెళ్లినది ఎవరు?
- హెలికాప్టర్ ఇవ్వలేదని అలిగినది ఎవరు?
- సీఎం అవుతామని పోస్టులు పెడుతున్నదెవరు?
- మొన్న హరీశ్, నేడు మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనం

**ఆ మంత్రులెవరు?**

*సీఎం రేవంత్ పీఠానికి ఓ మంత్రి ఎసరు పెడుతున్నారని దాదాపు ఆరు నెలల కిందటనే ఆరోపణలు వచ్చాయి. ఆ మంత్రి ఏకంగా అప్పటి ఏపీ అధికార పార్టీ నేతలతో కలిసి మరీ పన్నాగం పన్నుతున్నట్లు కథనాలు పుట్టాయి. పైగా ఆ మంత్రి అప్పటి ఏపీ అధికారా పార్టీకి అత్యంత సన్నిహితుడు. ఈ నేపథ్యంలోనే రేవంత్ అప్రమత్తం కావాలంటూ ఆయన శ్రేయాభిలాషుల నుంచి సలహాలు వెళ్లాయి. తాజాగా ఓ మంత్రి తెలంగాణ గవర్నర్‌ను కలిశారట. ముఖ్యమంత్రి ఆదేశాలతోనే ఆయన వెళ్లారా? లేక సొంతంగానా? గతంలో రేవంత్ కుర్చీకి ఎర్త్ పెట్టేందుకు ప్రయత్నించిన మంత్రి ఈయనేనా? అనేది తెలియాల్సి ఉంది.*

**(వాయిస్ టుడే ప్రత్యేక ప్రతినిధి)**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై రాజకీయ కుట్ర జరుగుతోందా? ఎంతో కష్టపడి.. రాజకీయంగా ఒక్కో మెట్టు ఎక్కుతూ పైకి వచ్చిన ఆయనను కిందకు పడదోసే ప్రయత్నం సాగుతోందా..? జడ్పీటీసీ సభ్యుడి నుంచి ముఖ్యమంత్రి పదవి వరకు ఎదిగిన రేవంత్ ను ఏడాది కాకుండానే ఆ పదవి నుంచి దించేసేందుకు తెరవెనుక ‘మంత్రాంగం’ జరుగుతున్నదా? పరిస్థితులు చూస్తుంటే ఔననే సమాధానమే వస్తోంది. ఇప్పటివరకు సాఫీగానే సాగిన రేవంత్ పాలనపై క్రమంగా నిరసన గళాలు వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా హైడ్రా దూకుడు, టీజీఎస్పీ కానిస్టేబుళ్ల వివాదం, గ్రూప్ 1 పరీక్షల వ్యవహారం సర్కారును ఆత్మరక్షణలో పడేశాయి. వీటన్నిటికీ మించి మురికి కూపం మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటూ రేవంత్ రెడ్డి ముందుకెళ్తుండడం ప్రతిపక్షాల విమర్శలకు మంచి సరుకుగా మారింది.

### దించేద్దామని ప్రయత్నాలట?

గత ఏడాది డిసెంబరు 7న రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అంటే అటుఇటుగా 11 నెలలు. ఓ విధంగా చెప్పాలంటే కాంగ్రెస్ వంటి పార్టీలో అత్యంత తేలికగా సీఎం అయినది రేవంత్ మాత్రమే. అత్యంత ప్రజాదరణ ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి వంటి నాయకుడు కూడా 2004లో ఎంతో పోటీని ఎదుర్కొన్ని సీఎం అయ్యారు. రేవంత్ మాత్రం నిరుడు ఏకగ్రీవ ఎంపిక తరహాలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. అయితే, - మిగతా 2వ పేజీలో



# ప్రజా పాలనలో హోం మంత్రి ఎప్పుడు?

- తెలంగాణలో కొత్త ప్రభుత్వానికి దాదాపు 11 నెలలు
- ఇప్పటికీ హోం మంత్రి లేకపోవడం గమనార్హం
- మంత్రి వర్గంలో ఇంకా ఆరు ఖాళీలు ఖాళీగానే
- హోం మంత్రిత్వ శాఖ ఇంకా సీఎం వద్దనే
- కొన్ని రోజులుగా తెలంగాణలో రాజకీయాలు గరంగరం
- పలు విషయాల్లో ఆత్మ రక్షణలో ప్రభుత్వం
- విపక్షాలకు కౌంటర్, మీడియాకు వివరణ ఇచ్చేదెవరు?
- ఇలాగైతే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల మధ్య తేడా ఏమిటి?
- నాడు కేసీఆర్ పాలనలో ఏకపక్ష ధోరణిపై విమర్శలు
- మరి నేడు రేవంత్ సర్కారులోనూ అదే తీరంటూ వ్యాఖ్యలు

**(వాయిస్ టుడే ప్రత్యేక ప్రతినిధి)**

దాదాపు పదేళ్ల గులాబీ పార్టీ పాలన అనంతరం తెలంగాణలో నిరుడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. బీఆర్ఎస్ హయాంలో నిరంకుశ పాలన సాగిందని.. తాము ప్రజా పాలన అందిస్తామని హస్తం పార్టీ ప్రజాభిమానం సంపాదించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో 64 సీట్ల బొటాబొటీ మెజారిటీతోనే పగ్గాలు చేపట్టింది. గత ఏడాది డిసెంబరు 7న రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అంటే దగ్గరదగ్గరగా 11 నెలుల అన్న మాట. ఈ వ్యవధిలో ఎన్నో పరిణామాలు జరిగాయి. విపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం, లోక్ సభ ఎన్నికలు, హైడ్రా దూకుడుపై విమర్శలు, గ్రూప్ 1 పరీక్షలపై వివాదం, మూసీ ప్రక్షాళన సందర్భంగా ప్రతిపక్ష నాయకుల - మిగతా 2వ పేజీలో

## కేటీఆర్ మోకాళ్ల యాత్ర చేసినా జనం నమ్మరు: బండి సంజయ్



**బెజ్జంకి (సిద్దిపేట):** బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్ పాదయాత్ర కాదు.. మోకాళ్లపై యాత్ర చేసినా ప్రజలు నమ్మరని బీజేపీ జాతీయ కార్యదర్శి, కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంగ రవి ఇంట్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై తాను పాదయాత్ర చేస్తే బీఆర్ఎస్ దాడి చేయిం చిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యా రన్నారు. కేటీఆర్ అతి మాటలతో నాయకు లు పార్టీని వీడుతున్నారని సంజయ్ తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందేనని ఎద్దేవాచేశారు. అధికారంలోకి వచ్చాక 6 గ్యారంటీలు అమలుచేస్తామన్న కాంగ్రెస్ ప్రభు త్వం వాటిని విస్మరించిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బెజ్జంకి ప్రజల ఆకాంక్ష మేరకు మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలుపుతామని సంజయ్ తెలిపారు.



## ఫాం హౌజ్ డ్రగ్స్‌ను డౌన్‌ప్లే చేయండి?

**పలు మీడియా సంస్థలకు బీఆర్ఎస్ పెద్దల వినతి | ఈ మేరకు జొన్వాడ ఘటనపై అంటీముట్టనట్లు తీరు**

**(వాయిస్ టుడే ప్రత్యేక ప్రతినిధి)**


తెలంగాణలో గత వారం రోజులుగా జొన్వాడ ఫాంహౌస్ చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిదికి చెందిన జొన్వాడ ఫాంహౌస్ లో పార్టీ జరగడం అందులో పాల్గొన్న విజయ్ మద్దూరి అనే వ్యక్తికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చిందంటూ కథనాలు వ్యాపించడం కలకలానికి దారితీసింది. ఇక కేటీఆర్ సొంత బావ మరిది ఫాంహౌస్ లోనే డ్రగ్స్ వాడకం జరిగిందంటూ వార్తలు రావడం బీఆర్ఎస్ పార్టీకి చెడ్డపేరు తెస్తుందనేది సాధారణమే. కాగా, ఇప్పటికే బీఆర్ఎస్ కీలక నేతల చుట్టూ డ్రగ్స్ వివాదాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో డ్రగ్స్ పేరిట సినిమా పరిశ్రమ వారిని విచార ణకు పిలవడం కూడా వీటిలో ఒకటి. ఈ నేపథ్యంలోనే తాజా ఘటన బయటకు రావడంతో కారు పార్టీలో కలకలం పుట్టించింది అని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### మీడియాలో పేలకుండా?

గత శనివారం జరిగిన జొన్వాడ ఫాం హౌజ్ పార్టీ వ్యవహారాన్ని మీడియాలో పేలకుండా - మిగతా 2వ పేజీలో

## ‘భద్రాద్రి.. యాదాద్రి’పై సర్కారుకు నివేదిక

- పవర్‌ప్లాంట్లలో అవకతవకలు,
- ఖజానాకు జరిగిన నష్టం వెల్లడి
- నిర్ణయాలన్నీ మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్నారని నిర్ధారణ!
- కేసులుపెట్టే యోచనలో ప్రభుత్వం!
- అసెంబ్లీలో చర్చించిన తర్వాత నిర్ణయం



**హైదరాబాద్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం, ఛత్తీస‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో అవకతవకలు చోటు చేసుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించిన జస్టిస్ మదన్ బి.లోకూర్ కమిషన్.. గడువు చివరి తేదీ అయిన గత నెల 28న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రస్తుతం రాష్ట్ర ఇంధన శాఖ వద్ద ఈ నివేదిక ఉంది. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీనిపై సమీక్ష నిర్వహించడంతో పాటు కేబినెట్ భేటీలో చర్చించి తదుపరి కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రాష్ట్ర శాసనసభలో - మిగతా 2వ పేజీలో

## రేవంత్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది

- వచ్చే జూన్-డిసెంబర్ మధ్యలో సీఎం మార్పు
- ఏడుసార్లు వెళ్లినా రేవంత్‌కు..
- రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు
- రేవంత్ ప్రత్యామ్నాయానికి అధిష్టానం చూస్తోంది
- సీఎం రేసులో ఉత్తమ్, భట్టి, వెంకట్‌రెడ్డి పోటీ
- మీడియాతో ఇష్టాగోష్టిలో మహేశ్వర్‌రెడ్డి




**హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డికి హనీమూన్ పీరియడ్ ముగిసి కౌంట్‌డౌన్ మొదలైందని... వచ్చే ఏడాది జూన్-డిసెంబర్‌ల మధ్య ఆయన పదవి పోవడం ఖాయమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌కు ప్రత్యామ్నాయం కోసం కాంగ్రెస్ అధి ష్టానం చూస్తోందని..కొత్త సీఎంగా ఎవరిని పెట్టాలనే దానిపై రహస్యంగా - మిగతా 2వ పేజీలో

## త్వరలో పాదయాత్ర చేస్తా...

**ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం: కేటీఆర్**

- ఇప్పుడు జరుగుతున్న నష్టం నుంచి కోలుకోవడం కష్టమే
- రాజకీయాల్లోకి కుటుంబాలను లాగడం అత్యంత నీచం
- త్వరలో పార్టీ సోషల్ మీడియా బృందంతో సమావేశం
- కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో మార్గదర్శనం చేస్తున్నారు
- కొత్త సంవత్సరంలో కేసీఆర్ జనంలోకి వస్తారని వెల్లడి



**హైదరాబాద్:** పార్టీ కార్యకర్తల కోరిక మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాద యాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీ రామారావు ప్రకటించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా తన పాదయాత్ర ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లోకి కుటుంబ సభ్యులను లాగడం అత్యంత నీచమన్నారు. తన కుటుంబాన్ని రాజకీయాల్లోకి లాగుతున్న సీఎం రేవంత్, ఆయన వందిమాగధులపై ప్రజల మద్దతుతో పోరాటం చేస్తానని పేర్కొన్నారు. గురువారం సామాజిక మాధ్యమ వేదిక ‘ఎక్స్’లో ‘ఆస్క్ కేటీఆర్’పేరిట నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇచ్చారు. ఆయా అంశాలు కేటీఆర్ మాటల్లోనే..

### ఈ నష్టం నుంచి కోలుకోవడం కష్టమే..

“తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన ఒక శాపంగా - మిగతా 2వ పేజీలో

## తప్పుడు సమాచారమిస్తే క్రిమినల్ చర్యలు

**బీసీ ఏ, ఈలోకి చేర్చాలంటూ కొన్ని కులాల వినతులు**

**బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్**



**కరీంనగర్:** బీసీలు కాకున్నా కులగణన సర్వేలో బీసీలుగా నమోదు చేసుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లు ఖరారు చేసే అంశంపై శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి - 2వ పేజీలో

# ఫాం హౌజ్ డ్రగ్స్‌ను డౌన్‌ప్లే చేయండి?

(మొదటి పేజీ తరువాయి)

చూశారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు బీఆర్ఎస్ పెద్దల నుంచి ఆయా మీడియా సంస్థలకు ఫోన్లు వెళ్లాయట. దీనికితగ్గట్లే వారు కూడా కొంత ఆచితూచి వ్యవహరించారనే టాక్ వినిపిస్తోంది. రాజకీయంగా ఏ చిన్న విషయం జరిగినా 'తూటా' కంటే వేగంగా కథనాలు రాసే మీడియా సంస్థలో జొన్వాడ ఘటనపై కనీసం చిన్న వార్త కూడా రాలేదు.

**ప్రధాన మీడియాలోనూ..**

తమకు వ్యతిరేకంగా ఉన్న ఒకటీ అరా తప్ప జొన్వాడ ఘటనను ప్రధాన మీడియాలో చాలావరకు బీఆర్ఎస్ నేతలు తమకు తగ్గట్లుగా వచ్చేలా చూసుకున్నారట. విజయ్ మద్దూరి, రాజ్ పాకాల ఫొటోలు లేకుండా, ఈ ఘటనపై ఫాలో అప్ లు, ఇతర విశ్లేషణల జోలికి పోకుండా చూశారు. దీంతోనే ప్రధాన పత్రికల్లో కొన్నిటిలో జొన్వాడ ఘటన అత్యంత సాదాసీదాగా వచ్చింది. మరి.. ఈ ఘటనను ఆయా మీడియా సంస్థలు కేవలం రాజకీయ కోణంలో చూశాయా? పెద్దగా వాస్తవం లేదని భావించాయా? ఏదైతేనేం బీఆర్ఎస్ పెద్దలు కోరుకున్నట్లుగానే చేశాయి.

**మున్ముందు ఏం చేస్తారో?**

ఇప్పటికైతే జొన్వాడ ఫాంహౌస్ ఘటనను సాధ్యమైనంత డౌన్ ప్లే చేసినా.. మున్ముందు మరింత ఆధారాలు దొరికితే ఏం చేస్తారనేది చూడాలి. ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ పెద్దలను ఇరికించే ఉద్దేశంలో మరింత దూకుడు చూపితే ఎలాగనేది ఆసక్తికరం కానుంది. అలాంటప్పుడు ప్రధాన మీడియా సంస్థలకు ప్రభుత్వ ఒత్తిడి కూడా తప్పదు. మరి అడకత్తెరలో పోకచెక్కలాంటి ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఏం చేస్తారనేది చూడాల్సి ఉంది.

# రేవంత్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది

(మొదటి పేజీ తరువాయి)

ఓ కమిటీ అన్వేషణ సాగిస్తోందన్నారు. సీఎం రేసులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ఉన్నారని చెప్పారు. మూసీ ప్రాజెక్ట్ వ్యయం ఒకేసారి రూ.50 వేల కోట్ల నుంచి రూ.లక్షన్నర కోట్లకు పెంచి భారీగా అవినీతికి ప్లాన్ చేశారని, ఏకపక్షంగా సొంత ఎజెండాతో సెలక్షన్, కరప్షన్, బ్లాక్‌మెయిలింగ్ వంటి వాటికి దిగడం దీనికి కారణమని ఆరోపించారు. మూసీ, హైడ్రా కూల్చివేతలతో పేదల్లో కాంగ్రెస్ అభాసుపాలు కావాల్సి వస్తోందని హైకమాండ్ ఆందోళన చెందుతోందన్నారు. శుక్రవారం మహేశ్వర్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కొందరు సీనియర్ మంత్రులు హైడ్రా, మూసీ, ల్యాండ్ సెటిల్‌మెంట్ల మీద రేవంత్‌పై హైకమాండ్‌కు ఫిర్యాదు చేసినట్టు తమకు సమాచారం ఉందన్నారు. మూసీ ప్రాజెక్టు వ్యయాన్ని మూడొంతులు పెంచి తన స్వార్థం కోసం కాంగ్రెస్‌ను వాడుకుంటున్నారని, ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారని చెప్పారు. రేవంత్ ఏకపక్ష ధోరణిని కూడా పలువురు నేతలు అంగీకరించడం లేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కాకుండా రేవంత్‌రెడ్డి తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా హైకమాండ్‌కు చేరాయని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు కూడా సోనియాగాంధీకి ఫిర్యాదు చేశారని, కూల్చివేతలపై నివేదిక సమర్పించారని చెప్పారు. దీనిపై పరిశీలనకు సోనియా సూచనలతో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ రంగంలోకి దిగి ఫోన్ చేస్తే రేవంత్ స్పందించలేదన్నారు. ఫోన్ ఎత్తకపోగా హైకమాండ్‌కు తాను స్పందించలేదని రేవంత్‌రెడ్డి పేర్కొనడాన్ని అధిష్టానం తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. సీనియర్ మంత్రులు, పార్టీ నేతల ఫిర్యాదులపై కాంగ్రెస్ అధిష్టానం సీరియస్‌గా ఉందని తెలుస్తోందన్నారు. రేవంత్ వ్యతిరేకవర్గం ఢిల్లీలో అధిష్టానం వద్ద గట్టిగా లాబీయింగ్ నిర్వహిస్తోందన్నారు. ఈ కారణంగానే ఇప్పటికే ఏడుసార్లు ఢిల్లీకి వెళ్లినా, రేవంత్‌కు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కేబినెట్ విస్తరణ వాయిదా వేస్తూ వస్తున్నారన్నారు. మొత్తం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటామంటూ ఫిరాయింపులకు రేవంత్‌రెడ్డి తెరతీశారని తెలిపారు. అయితే ఆ పార్టీ నుంచి వచ్చిన పదిమంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు మళ్లీ కేసీఆర్‌తో టచ్‌లోకి వెళ్లారన్నారు. దీంతో పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న అంశానికి భిన్నంగా ఫిరాయింపులు చేపట్టడంపై హైకమాండ్ ఆగ్రహంతో ఉందని చెప్పారు. ఈ పరిణామాల నుంచి బీఆర్ఎస్ లాభపడుతుందా అనే ప్రశ్నకు లోక్‌సభ ఎన్నికల్లో డకౌట్ అయ్యి ఏం చేయగలుగుతుందని వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్-బీఆర్ఎస్ ఒక్కటైనా.. బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగానే వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

# త్వరలో పాదయాత్ర చేస్తా...

(మొదటి పేజీ తరువాయి)

మారింది. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభు త్వానికి ఏమాత్రం లేదు. సర్కారు వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు కాం గ్రెస్ ప్రారంభించిన రాజకీయ వేధింపులకు భయపడేది లేదు. కాంగ్రెస్ పాలన ఢిల్లీ నుంచి, ఢిల్లీ కోసమే అన్నట్టుగా తయా రైంది. రాష్ట్రం నుంచి పెట్టుబడులు కూడా వెనక్కి మళ్లుతున్నాయి. కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న నష్టం నుంచి తెలంగాణ కోలుకోవడం కష్టమే. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చే పార్టీకి తెలంగాణను ముందుకు తీసుకెళ్లడం అతిపెద్ద సవాల్‌గా మారుతుంది.

**రాజకీయాల్లోకి కుటుంబాలను లాగడం నీచం**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఇతరుల కుటుంబ సభ్యులను రాజకీయ అంశాల్లోకి లాగలేదు. సుమారు రెండు దశాబ్దాల రాజకీయ జీవితంలో కుటుంబ సభ్యులను అవహేళన చేసి మాట్లాడినప్పుడు, రాజకీయాలు వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురయ్యాను. కేవలం రాజకీయాల కోసం ఇతరుల కుటుంబ సభ్యులను ఎందుకు లాగుతారో అర్థం కాదు. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నీచ రాజకీయ సంస్కృతి అత్యంత హీనదశకు చేరుకుంది. కాంగ్రెస్‌ను ఐదేళ్ల కోసం ప్రజలు ఎన్నుకున్నారు. ఈ సీఎం ఐదేళ్లు పదవిలో ఉంటారా లేదా అనేది చెప్పలేం. కాంగ్రెస్‌లో ఎప్పుడైనా ఎలాంటి పరిణామమైనా జరగొచ్చు.

**ఆ అధికారులను గుర్తుపెట్టుకుంటాం!**

విధులు మరిచి, చట్టవిరుద్ధంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై రెచ్చిపోతున్న పోలీస్ అధికారులను గుర్తుపెట్టుకుని.. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ అధినేతలను ప్రసన్నం చేసుకునే పనుల్లో కొందరు పోలీసు అధికారులు బిజీగా ఉండటంతో శాంతిభద్రతలు క్షీణించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలసి పనిచేస్తున్నాయి. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ వంటి పార్టీలపై చర్యలకు బలమైన సంస్కరణలు అవసరం.

**కొత్త సంవత్సరంలో జనంలోకి కేసీఆర్..**



ఎన్నికల్లో ఓటమి తర్వాత సామాజిక మాధ్యమాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు ప్రపంచవ్యాప్తంగా బాగా యాక్టివ్‌గా మారారు. త్వరలో సోషల్ మీడియా విభాగంతో విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. పార్టీ అధినేత కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో పార్టీకి, నాయకులకు ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తున్నారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుకు సరిపడా సమయం ఇచ్చారు. నూతన సంవత్సరం తర్వాత ఆయన నుంచి మరిన్ని కార్యక్రమాలను చూస్తాం. ప్రతిపక్ష పార్టీగా నూతన నాయకత్వాన్ని తయారు చేసుకునే అవకాశం వచ్చింది. పార్టీ ఫిరాయింపులు జరిగిన పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఖాయం.."అని కేటీఆర్ పేర్కొన్నారు.

# తెలంగాణలో తెరవెనుక 'మంత్రాంగం'

(మొదటి పేజీ తరువాయి)

ఈ ముచ్చట ఏడాది లోపే ముగియనుందని రేవంత్ రాజకీయ ప్రత్యర్థులు వ్యాఖ్యలు చేస్తున్నారు.

**'అధిష్టానం' అనుగ్రహానికి..**

కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానమే అన్నీ అనే సంగతి తెలిసిందే. పెద్దగా ప్రజా బలం, మాస్ నాయకుడి లక్షణాలు లేకున్నా అధిష్ఠానం పెద్దల ఆశీసులతోనే ఉమ్మడి రాష్ట్రంలో ఓ నాయకుడు సీఎం అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా ఓ మంత్రి ఇలాంటి ప్రయత్నాల్లోనే ఉన్నట్లు చెబుతున్నారు. ఆయన 'అధిష్టానం' పెద్దలను కలిసేందుకు ఇటీవల ఢిల్లీకి వెళ్లారట. అయితే, ఇది రేవంత్ ఆదేశాలతోనే జరిగిందా? లేక కాంగ్రెస్ లో ఇలాంటివన్నీ భాగమే అని సరిపెట్టుకో వాలా? అనేది ఆసక్తికరం.

**హెలికాప్టర్ ఇవ్వలేదట..:** ఇక హెలికాప్టర్ ఇవ్వలేదంటూ ఓ మంత్రి ఇటీవల ప్రభుత్వంపై అలిగారట. వాస్తవానికి రెండు నెలల కిందట జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాల్సిన ఓ మంత్రి జిల్లాలో ఉండిపోయారు. దీంతో రేవంత్ రెడ్డి హెలికాప్టర్ పంపేందుకు సిద్ధమయ్యారు. చివరకు ఆ మంత్రి ఎలాగోలా హైదరాబాద్ చేరుకున్నారు. అలాంటిది తాజాగా ఓ మంత్రి హెలికాప్టర్ ఇవ్వలేదని అలిగారంటేనే ఏదో తేడా కొడుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాగా, మరికొందరు తెలంగాణ కాంగ్రెస్ నేతలు.. త్వరలో తాము సీఎం అవుతామంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారట. ఇది నేరుగా వారు చేస్తున్న పనేనా? లేక వారి అభిమానులు చేస్తున్న ఆకతాయి వ్యవహారమా? అనేది ప్రభుత్వం తేల్చితేనే బాగుంటుంది.

**సీఎం మార్పుపై మొన్న హరీశ్, నేడు మహేశ్వర్ రెడ్డి**

రేవంత్ పై కుట్రలు జరుగుతున్నాయంటూ మొన్న హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు ఎన్నికలు పెడితే తామ వంద సీట్లు గెలుస్తామని చెబుతూ మీడియా చిట్ చాట్ లో మంత్రుల పన్నాగం ఇది అని వ్యాఖ్యానించారు. తాజాగా బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా త్వరలో తెలంగాణ సీఎం మార్పు ఉంటుందని అన్నారు. తాను ఏ విషయమైనా ఆచితూచి మాట్లాడతానని.. తేలిగ్గా ఏమీ విమర్శంచనని ఆయన అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏకపక్ష ధోరణిని సీనియర్ మంత్రులు ఒప్పుకోవడం లేదని కూడా మహేశ్వర్ రెడ్డి ప్రస్తావించడం గమనార్హం. కాగా, వీటిపై రేవంత్ వర్గం, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం నుంచి స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

# ప్రజా పాలనలో హోం మంత్రి ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనలు తదితరాలు ఇందులో కీలకమైనవి. ఇక తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) కానిస్టేబుళ్ల కుటుం బాలు వీధుల్లోకి రావడంతో ప్రభుత్వంపై విమర్శలు వచ్చా యి. వీటికితోడు డ్రగ్స్, ఇటీవలి జొన్వాడ ఫాంహౌజ్ ఘటనలు సరేసరి.

**కీలక సందర్భాల్లో..**

అత్యంత కీలకమైన శాంతిభద్రతల విషయమై ఏదైనా మాట్లాడేందుకు హోంమంత్రి వైపు అందరూ చూస్తారు. ఉదాహరణకు జొన్వాడ ఫాంహౌస్ ఘటనలో బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిదిపైనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై విమర్శలు వస్తే మీడియా ముందుకు వచ్చి మాట్లాడేందుకు హోంమంత్రి లేరు. ఏదేమైనా పోలీస్ శాఖనే స్పందించాల్సి వస్తోంది. తెలంగాణ సమాజంలో అత్యంత ఆందోళనకరంగా మారిన డ్రగ్స్ మహమ్మారి విషయంలోనూ ఇదే వర్తిస్తోంది.

**ఇంకా ఆరు ఖాళీలు ఖాళీగానే**

మంత్రివర్గంలో ఇంకా ఆరు ఖాళీలు ఉన్నాయి. కొత్తగా మంత్రులను చేర్చుకునవారికి హోం శాఖ ఇస్తారా? లేక ఇప్పటికే ఉన్న మంత్రివర్గాన్ని మార్పులు చేస్తారా? అన్నది చూడాలి. విస్తరణ కోసం ఇప్పటికే సీఎం రేవంత్ పలుసార్లు అధిష్ఠానాన్ని కలిశారు. కానీ, అటునుంచి ఆమోద ముద్ర వచ్చినట్లు లేదు. ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల నుంచి హోం శాఖను రేవంత్ రెడ్డే చూస్తున్నారు.

విషయం ఏమంటే.. దాదాపు రెండు నెలల కిందటి వరకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ (టీపీసీసీ) అధ్యక్షుడు కూడా ఆయనే. అయితే, ప్రభుత్వం ఏర్పాడి ఏడాది కావొస్తుండడంతో విపక్షాలు దూకుడు పెంచుతున్నాయి. విమర్శలకే పరిమితం కాకుండా ప్రజాక్షేత్రంలోకి కూడా వెళు తున్నాయి. రాజకీయాలు గరంగరంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో హోం శాఖకు ప్రత్యేకంగా మంత్రి ఉండాల్సిందే.

**పలు విషయాల్లో ఆత్మ రక్షణలో ప్రభుత్వం**

కొన్నిసార్లు దూకుడుగా వెళ్లడం కూడా ఆత్మరక్షణలో పడేసేలా చేస్తుంది. హైడ్రా వంటి విషయాల్లో ఇదే నిరూ పితం అయింది. ఇలాంటివాటిపై ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్, మీడియా ముందుకొచ్చి వివరణ ఇచ్చేందుకు హోంమంత్రి లేరు. కాగా, పదేళ్ల కేసీఆర్ పాలనను నిరంకుశంగా అభివర్ణించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అదే ధోరణిలో వెళు తొందనే విమర్శలు వస్తున్నాయి. అప్పట్లో కేసీఆర్ కేబినెట్ పై కాంగ్రెస్ పార్టీ విమర్శలు తీవ్రంగా ఉండేవి. మంత్రులెవరికీ మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వకుండా కేసీఆర్ అన్ని నిర్ణయాలు తీసుకుంటారని ఆరోపించేవారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు దీ ఇదే తీరనే మాట రాకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉంది.

# రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు తీరు బాగుంది

## కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా

**హైదరాబాద్:** ధాన్యం కొనుగోలు విష యంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యవస్థాగత మార్పులు బాగున్నాయని కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా పేర్కొన్నా రు. శుక్రవారం ఆయన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా పౌరసరఫరాల విభాగం కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు, ఈ విషయంలో తీసుకొచ్చిన మార్పుల గురించి మంత్రి ఆయనకు వివరించారు. ఈ భేటీలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ చౌహాన్, ఎఫ్‌సీఐ ఈడీ లాజరస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంజీవ్ చోప్రా ఏజీ కాలనీలోని చౌక ధరల దుకాణాన్ని సందర్శించారు. సరుకులు అందుతున్న తీరును కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. చౌక ధరల దుకాణం నిర్వహణ ద్వారా సమకూరుతున్న ఆదాయం గురించి డీలర్‌ను ప్రశ్నించారు. నెలకు రూ.30 వేల ఆదాయం వస్తోందని డీలర్ పేర్కొనగా, విక్రయాలు పెంచుకోవటం ద్వారా రూ.లక్ష వరకు ఆదాయం వచ్చే వీలుంటుందని చోప్రా చెప్పారు. అనంతరం ఆయన ఎర్రమంజిల్ కాలనీలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి వెళ్లి చౌక ధరల దుకాణాల పర్యవేక్షణ విధానం, ఇతర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు.

# 'భద్రాద్రి.. యాదాద్రి'పై సర్కారుకు నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

కూడా నివేదికను ప్రవేశపెట్టి చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**తదుపరి చర్యలకు సిఫార్సు:** టెండర్లు లేకుండా నామినేషన్ ప్రాతిపదికన యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని బీహెచ్ఈఎల్‌కు అప్పగించడం, టెండర్లకు వెళ్లకుండా ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకోవడంలో చోటు చేసుకున్న విధానపరమైన అవకతవకతలు, వీటితో రాష్ట్ర ఖజానాకు జరిగిన నష్టాన్ని కమిషన్ లెక్కగట్టినట్లు తెలిసింది. వీటికి సంబంధించిన నిర్ణయాలన్నీ నాటి సీఎం కేసీఆర్ తీసుకున్నారని కమిషన్ నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. ఆయనతో పాటు గత ప్రభుత్వంలోని ఇతర మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులూ బాధ్యులని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ విషయంలో తదుపరి దర్యాప్తు కోసం తీసుకోవాల్సిన చర్యలను కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కాగా దీని ఆధారంగా ప్రభుత్వం కేసీఆర్‌తోపాటు ఇతరులపై కేసు నమోదు చేసి తదుపరి విచారణకు ఆదేశించాలని భావిస్తున్నట్టు తెలిసింది.

**కేసీఆర్‌ను విచారించకుండానే నివేదిక!**

తొలుత జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిషన్ ఏర్పాటు కాగా, ఆయన గత ప్రభుత్వంలోని మాజీ ప్రజా ప్రతినిధులు, విద్యుత్ సంస్థల సీఎండీలు, ఇతర అధికారులు, ప్రస్తుత రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, ఇతర సాక్షుల అభిప్రాయ సేకరణ ప్రక్రియను పూర్తి చేశారు. పలువురికి క్రాస్ ఎగ్జామినేషన్ సైతం నిర్వహించారు.

రాతపూర్వకంగా లేదా వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయగా, ఆయన్నుంచి రాత పూర్వక సమాధానం అందింది. నిర్ణయాలను తీసుకోవడానికి దారి తీసిన పరిస్థితులను వివరిస్తూనే..విచారణ కమిషన్ బాధ్యతల నుంచి వైదొలగాల్సిందిగా జస్టిస్ నరసింహారెడ్డిని అప్పట్లో కేసీఆర్ కోరారు. కాగా విలేకరుల సమావేశంలో కేసీఆర్‌పై జస్టిస్ నరసింహారెడ్డి చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు.. విచారణ బాధ్యతల నుంచి తప్పుకోవాల్సిందిగా జస్టిస్ నరసింహారెడ్డిని ఆదేశించింది. ఆయన స్థానంలో నియమితులైన జస్టిస్ లోకూర్..సాక్ష్యాలు, నివేదికల పరిశీలన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. కేసీఆర్ ఇచ్చిన జవాబును ఆయన పరిగణనలోకి తీసుకున్నట్టు సమాచారం.

**సీఎం రేవంత్ సమీక్ష**

గత ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ నిర్ణయాలకు సంబంధించి అందిన నివేదికపై సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. నివేదికలోని అంశాలను అధికారులు సీఎంకు వివరించారు.

# డీసీసీబీల్లో అవకతవకలపై విచారణ పూర్తి చేయాలి: తుమ్మల



**హైదరాబాద్:** గతంలో డీసీసీబీ, డీసీఎంఎస్‌లలో జరిగిన అవకతవకలపై శాఖాపరమైన విచారణ పూర్తి చేయాలని, బాధ్యులపై చర్యలతో పాటు నిధులు రికవరీ చేయాలని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీ క్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ప్రాథ మిక సహకార సంఘాలకు సంబంధించిన రైతులకు అవసరమైన సేవలు అందించాలని అధికారు లకు సూచించారు. అవసరమున్న చోట కొత్త శాఖలు ఏర్పాటు చేసి సంఘాల పరిపుష్టికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మారుతున్న కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రయోగాత్మకంగా ప్రతి జిల్లాలో ఒక మోడల్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఫిర్యాదులు చేయడానికి, పత్తి పంటను విక్రయానికి తీసుకురావడానికి అనువైన సమయం తెలుసుకునేందుకు 8897281111 నంబర్‌లో వాట్సాప్ సేవలను వినియోగించుకోవాలని ఆయన రైతులను కోరారు.

**ఆయిల్‌పామ్ ఉప ఉత్పత్తుల మీద దృష్టి సారించాలి**

భవిష్యత్‌లో ఆయిల్ పామ్ సాగును మరింత పెంచాలని, ఆయిల్‌పామ్ ఉప ఉ త్పత్తుల మీద దృష్టి సారించాలని అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఆయిల్‌పామ్ గెలల టన్ను ధర రూ.19,144కు చేరినందున శుక్రవారం ఆయిల్ ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా, జీఎం సుధాకర్‌రెడ్డి తదితరులు మంత్రి తుమ్మలను కలిసి ధన్యవాదాలు తెలిపారు. పెరిగిన ఆయిల్ పామ్ ధరతో రైతుల వృద్ధికి తోడ్పాటు అందించినట్లు అవుతుందన్నారు.

# తప్పుడు సమాచారమిస్తే క్రిమినల్ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా వేదికగా బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ సమగ్ర వివరాలు సేకరించనున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఇవే కీలకమని, దీని ఆధారంగానే రిజర్వేషన్లు, పథకాలు ఉంటాయని వివరించారు. కులాల వారీగా సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుసుకునేందుకు కలెక్టర్లకు బహిరంగ విచారణ చక్కటి అవకాశమని, 13 వరకు జరిగే కార్యక్రమాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొనాలని సూచించారు. కొన్ని కులాలు డీ నుంచి ఏ కు మార్చాలని, మరికొన్ని కులాలు బీసీ ఏ నుంచి ఎస్టీకి, బీసీ బీ నుంచి ఈకి రిజర్వేషన్లు మార్చాలని నివేదించారని, వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీసీ కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి, తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రకాశ్, కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.

**విచారణ రసాభాస:** బీసీ కమిషన్ బహిరంగ విచారణ రసాభాసగా మారింది. వివిధ బీసీ కుల సంఘాలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ వినతిపత్రాలు సమర్పించగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్‌కుమార్ బీసీ కమిషన్‌కు వినతిపత్రమిస్తూ కమిషన్ విచారణపై అనుమానాలు వ్యక్తం చేశారు. బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రొసీజర్ ల్యాప్స్ పేరుతో కోర్టు కొట్టివేసిందని, తెలంగాణలో కేవలం కాలయాపన కోసమే విచారణ, సర్వేలు చేస్తుందని దుయ్యబట్టారు. సర్వే కోర్టులో నిలబడుతుందా.. ఏ రకంగా నిలబడుతుందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. తన అభిప్రాయం చెప్పేందుకు కమిషన్ అనుమతించకపోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆక్షేపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కరూ రాకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరును కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి బీసీలకు ఏం చేశారని, రిజర్వేషన్ల అమలులో ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించారు. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఆదాయం పెంచేలా ఉపాధి పనులు

(మొదటి పేజీ తరువాయి)

అనుబంధ పనులకు ప్రాధాన్యం కల్పిస్తూ.. శాశ్వతంగా నిలిచేలా ఉపాధి హామీ పనులు చేపట్టనున్నామన్నారు. ఇందుకుగాను రూ.1,372 కోట్లతో వివిధ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

# సెక్రటేరియట్ సెక్యూరిటీ విధుల్లోకి టీజీఎస్పీఎఫ్ సిబ్బంది



**హైదరాబాద్:** బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం భద్రత విధుల్లో తెలంగాణ స్పెష ల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) శుక్రవారం చేరారు. తమ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో సెక్రటేరియట్ భద్రత విధుల నుంచి టీజీఎస్పీని తప్పించి టీజీఎస్పీఎఫ్‌కి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభు త్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సచివాలయం భద్రత కోసం ప్రస్తుతం 212 మంది టీజీఎస్పీఎఫ్ సిబ్బందిని పోలీసు ఉన్నతాధి కారులు కేటాయించారు. శుక్రవారం బాధ్యతల సందర్భంగా టీజీఎస్పీఎఫ్ సిబ్బంది సచివాల యం ప్రాంగణంలోని అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించి, కవాతు నిర్వహించారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
శనివారం, 1 నవంబర్, 2024



## గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ ప్రోగ్రాంను ప్రారంభించిన డిపో మేనేజర్ పద్మావతి

**వాయిస్ టుడే తొర్రూర్ నవంబర్ 1:** టి ఎస్ ఆర్టీసీ తొర్రూర్ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు కండక్టర్లు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరిరక్షణ కోసం శుక్రవారం నిష్ణాతులైన డాక్టర్ల పర్యవేక్షణలో గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ స్పౌస్ ప్రోగ్రాం ను టిఎస్ఆర్టిసి తొర్రూర్ డిపో ఆవరణలో డిపో మేనేజర్ వి పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిఎస్ఆర్టిసి తొర్రూర్ డిపోలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి తమ భార్యాభర్తలను తీసుకొని వచ్చి వివిధ రకాల టెస్టులను చేయించుకొని మీ ఆరోగ్యాన్ని మీ జీవిత భాగస్వామిల ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు కండక్టర్లు, సిబ్బంది తదితరులను కోరారు. ఈ కార్యక్రమలో విజయ్ కుమార్, సమద్, రజిత, గోపాలరెడ్డి హెల్త్ వాలంటీర్లు, సతీష్, ఉమాలు మెకానిక్ లు శ్రామిక్ లు పాల్గొన్నారు.

## సందడిగా దీపావళి సంబరాలు



**వాయిస్ టుడే తొర్రూరు నవంబర్ 1:** మండల వ్యాప్తంగా కోలాహలంగా దీపావళి వేడుకలు జరిగాయి. పర్వదినాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటిల్లిపాది ఒక్కచోట చేరి ఉత్సాహంగా టపాసులు పేల్చారు. దివ్వెల వెలుగుల్లో లోగిళ్లు మెరిశాయి. దీప కాంతుల వెలుగుల్లో తొర్రూర్ పట్టణం గ్రామాలు కళకళలాడాయి. పండుగను పురష్కరించుకొని మహిళలు తమ తమ ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు. వ్యాపార, వాణిజ్య సంస్థల సము దాయాల్లో భక్తిశ్రద్ధలతో లక్ష్మీ పూజలు నిర్వహించారు. దీపావళిని పురస్కరించుకొని మండలవాసులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

## వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి సాంబశివరావు..



**వరంగల్ ( వాయిస్ టుడే ) నవంబర్ 01:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాదు ఆర్డర్స్ ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి సాంబశివరావు గురువారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ కె వెంకటరమణ కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బదిలీ కావడం జరిగింది. వరంగల్ జిల్లా డిప్యూటీ డిఎంహెచ్వో గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్ గోపాల్ రావు ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా వెళ్లారు. డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాను అందరి సమన్వయ సహకారంతో మంచి సేవలు అందించి ప్రథమ వరుసలో ఉంచడానికి ప్రయత్నం చేద్దామని తెలిపినారు బదిలీపై వెళ్తున్న డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ అందరి సహకారంతో ఇక్కడ తన పదవి కాలాన్ని విజయవంతంగా నిర్వహించనని అందరికీ తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే వెంకటరమణ డాక్టర్ సాంబశివరావు డాక్టర్ గోపాలరావు డాక్టర్ పద్మశ్రీ కార్యాలయ సిబ్బంది పాల్గొనరు.

## సమగ్ర వివరాలతో సర్వే చేపట్టండి..

**బల్దియా అదనపు కమిషనర్ జోనా.. ఏన్యుమనేటర్లకు శిక్షణ తరగతులు**



**వరంగల్ ( వాయిస్ టుడే ) నవంబర్ 01:** సమగ్ర వివరాలతో సర్వే చేపట్టాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్టీతమ్మకంగా ఈ నెల 6 నుండి 18 వరకు నిర్వహించనున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి మరియు రాజకీయ సర్వే నిర్వహించనున్న నేపథ్యం లో వరంగల్ జిల్లా లో గల బల్దియా పరిధి ప్రాంత (కాశీ బుగ్గ సర్కిల్) వార్డు లలో సర్వే నిర్వహించు ఏన్యుమనేటర్లకు పోచమ్మ మైదాన్ అబ్బూస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు డిప్యూటీ కమిషనర్ కృష్ణా రెడ్డి పాల్గొని సమర్థవంతంగా సర్వే నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కమిషనర్ ఆదేశాల మేరకు సర్వేలో పాల్గొనే ఏన్యుమనేటర్లకు శిక్షణ అందించడం జరుగుతుందని ఇందుకోసం ఎంపికైన మున్సిపల్ సిబ్బంది రిసోర్సు పర్సనల్ అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు మున్సిపల్ బిల్ కలెక్టర్లు వార్డు ఆఫీసర్ల కు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇందుకోసం ప్రభుత్వం రూపొందించిన 73 ప్రశ్నల తో కూడిన ప్రశ్నావళి పై సంపూర్ణ అవగాహన కల్పించుకొని సమగ్ర సమాచారంతో సర్వే నిర్వహించాలని ఇందుకోసం ప్రతి ఎన్యుమనేటర్ వారికి కేటాయించిన గృహాల సంబంధిత సమాచార జాబితాను సిద్ధం చేసుకొవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వోలు షహజాది బేగం శ్రీనివాస్ సూపరిండెంట్ హబీబ్ టీఎంసీ రమేష్ ఐటి మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

- ప్రతి ఇంటిని ఖచ్చితంగా సర్వే చేయాలి.. కాజీపేట, హసన్ పర్తిలో మొదలైన సర్వే
- క్షేత్రస్థాయిలో స్థాయిలో జరుగుతున్న సర్వే పరిశీలించిన కలెక్టర్



**హనుమకొండ జిల్లా, నవంబర్ 1(వాయిస్ టుడే):** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే( సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఎన్యుమరేటర్లను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కాజీపేట మండల పరిధిలోని చైతన్యపురి కాలనీ, హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో కొనసాగుతున్న సామాజిక ఆర్థిక విద్యా ఉపాధి రాజకీయ కుల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే కొనసాగుతున్న విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గురించిన వివరాలను అధికారులతో పాటు ఎన్యుమరేటర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వే ఏవిధంగా చేపడుతున్నారని అధికారులను, ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వే అనంతరం ఇంటికి అతికిస్తున్న స్టిక్కర్లు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రతి ఇంటిని ఖచ్చితంగా సర్వే చేయాలని అధికారులను ఎన్యుమారేటర్లను ఆదేశించారు. ఎన్యుమరేషన్ బ్లాక్ ప్రకారం సర్వే నిర్వహించాలన్నారు. మాస్టర్ మ్యాపు ప్రకారం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి ఇంటికి సంబంధించిన అన్ని వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేషన్ బ్లాక్ లలో ఎన్నెన్ని ఇండ్లు ఉన్నాయో సరిగా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వేలో అన్ని వివరాలను కూడా జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసిల్దార్ బావ్ సింగ్, హసన్ పర్తి తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్, రెవెన్యూ ఆర్ఐ లు శివ, రాజేంద్ర ప్రసాద్, మునిసిపల్ ఆర్ఐ దేవరాజు, ఇతర అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

## చలో వరంగల్.. ఉద్యమకారుల గర్జన సభను విజయవంతం చేయండి..

**బీసీ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మపురి రామారావు పిలుపు.**



**వరంగల్ ( వాయిస్ టుడే ) నవంబర్ 01:** ఈ నెల 3 తారీకు జరిగే ఉద్యమ కారుల గర్జన సభను విజయవంతం చేయాలనీ బీసీ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మపురి రామారావు పిలుపునిచ్చారు శుక్రవారం నాడు వరంగల్ హంటర్ రోడ్ లో బీసీ గర్జన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్న అనంతరం అయన మాట్లాడుతూ,1969 నుండి ఇప్పటివరకు తెలంగాణలోని నిరుద్యోగులకు , రైతులకు, ప్రజలకు కష్టాలే మిగిలాయి.. ఎన్ని ఉద్యమాలు చేసినా కూడా ఉద్యోగాలలో గాని, నీళ్లలో గాని, నిధులలో గాని , సంపదలో గాని బీసీ , ఎస్సీ ,ఎస్టీ సబ్బండ వర్గాలకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా సరైన ప్రాతినిధ్య వాటా, సంపదలో వాటా దక్కలేదని తెలుపుతు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాలు ఇట్టి స్థలం , ఉద్యమకారులకు పింఛన్ మొదలైన కామారెడ్డి డిక్లరేషన్ హామీలు అమలు కాలేదు.కావున ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణ ఉద్యమకారులను, నిరుద్యోగులను, రైతులను, ప్రజలను ఈ కష్టాల నుండి , ఈ దోపిడీ వ్యవస్థ నుంచి గట్టెక్కించకపోతే మరొక తీవ్రతరమైన ఉద్యమం చేయవలసి వస్తుందని అయన హెచ్చరించారు 3వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరగబోయే తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఏర్పాటు చేస్తున్న.. ఉద్యమకారుల గర్జన సభ..కు వేలాదిగా ప్రజలు తరలిరావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బిసి బహుజన సంఘం నాయకులు అల్లి అజయ్ బాబు , రుద్రోజు నవీన్ , మడిపల్లి నాగరాజు గౌడ్ , పనికిల శ్రీనివాస్, ఐతమ్ నగేష్ , దార శివ మొదలు వారు పాల్గొన్నారు..

## కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న రేవంత్ సర్కార్

- మాలలకు తలవంచి సుప్రీం తీర్పును పక్కన పెట్టి రేవంత్ రెడ్డి
- వర్గీకరణ తరువాతే గ్రూపు 1,2 నియామకాలు చేపట్టాలి
- మాదిగ ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి: పుట్ట రవి మాదిగ



**హనుమకొండ జిల్లా, నవంబర్ 1(వాయిస్ టుడే):** భారత దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్భంలో దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ముందుగానే ఎస్సీల వర్గీకరణ చేపడతామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలకు అనుకూలంగా వత్తాసు పలుకుతూ కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ ఎస్సీ వర్గీకరణను పక్కనపెట్టారని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు పుట్ట రవి మాదిగ అన్నారు. శుక్రవారం హసన్ పర్తి లోని ఎర్రగట్టు గుట్ట లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాజారపు బిక్షపతి మాదిగ అధ్యక్షతన ఏర్పాటుచేసిన మాదిగ, మాదిగ ఉపకులాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పుట్ట రవి మాదిగ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మాల లకు తలవంచి ఎస్సీ వర్గీకరణను పక్కన పెట్టారని మండిపడ్డారు. ఇటీవల జరిగిన డిఎస్సీ నియామకాల్లో కూడా వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలు భర్తీ చేసిన రేవంత్ రెడ్డి మాదిగలపై ఉన్న వివక్షను.. మాలల పై ఉన్న ప్రేమను చూపించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. త్వరలో జరగనున్న గ్రూపు1,2 నియామకాలకంటే ముందే ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలని పుట్ట రవి మాదిగ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే ఘటనలకు ముఖ్యమంత్రి భాధ్యత వహించక తప్పదని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు మద్దత్తు గా ఈనెల 4వ తేదీన ఎర్రగట్టు గుట్ట వద్ద గల కెఎల్ఎన్ ఫంక్షన్ హాల్ లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరగనున్న మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం సభను అన్ని మాదిగ, ఉప కులాల మేధావులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని పుట్ట రవి మాదిగ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిజెపి పార్టీ జిల్లా నాయకులు తాళ్ల రమేష్ మాదిగ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బోడ యుగంధర్ మాదిగ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జన్ను రవీందర్ మాదిగ, కాంట్రాక్టర్ బొక్క కుమార్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు ఆరెపెల్లి పవన్ మాదిగ , టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సంఘాల విక్టర్ బాబు మాదిగ, ఎంఎస్పీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు రాజారపు బిక్షపతి మాదిగ, కారోబార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాతర సదానందం మాదిగ, మాజీ సర్పంచ్ ఆకారపు లింగస్వామి మాదిగ, ఇమ్మడి రాజేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు రేణు కుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు బొక్క సాంబరాజు మాదిగ, ఎంఎస్పి మండల నాయకులు నమిండ్ల సూర్యం మాదిగ, దేవన్నపేట ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు నందిపాక అరవింద్ మాదిగ, అనంతసాగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామంచ ఐలయ్య మాదిగ, నాగారం గ్రామ నాయకులు మేకల రమేష్ మాదిగ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పుల్ల జార్జి మాదిగ, టిఆర్ఎస్ నాయకులు గిన్నారపు రవీందర్ మాదిగ, ముచ్చర్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టెడ భరత్ మాదిగ, ఎంఎస్పి నాయకులు మంద వీరస్వామి మాదిగ, ఇమ్మడి ఎల్ల స్వామి మాదిగ, జన్ను కిషన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కమిషన్ బృందానికి ఘన స్వాగతం



**హనుమకొండ జిల్లా, నవంబర్ 1(వాయిస్ టుడే):** స్థానిక సంస్థల రిజర్వేషన్ల దామాషాపై నేడు ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బీసీ కమిషన్ బృందం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ కు శుక్రవారం రాత్రి 8.30 గంటలకు చేరుకుంది. హరిత కాకతీయ హోటల్ వద్ద రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి లకు హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిడి రామ్ రెడ్డి, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు కలెక్టర్, అదనపు కలెక్టర్ మొక్కలు అందించి స్వాగతం పలికారు. బీసీ కమిషన్ బృందం ఈరోజు ఉదయం భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 10 గంటలనుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నుంచి హనుమకొండ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో బీసీ కమిషన్ బృందం దరఖాస్తులను స్వీకరిస్తుందని అధికారులు తెలిపారు.



## ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే.. పర్యవేక్షించిన ఎంపీడీవో సత్తయ్య

**వాయిస్ టుడే ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 01:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎల్లారెడ్డిపేట మండలంలో అధికారులు శుక్రవారం ప్రారంభించారు. కుటుంబ సర్వేలో అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు కారోబార్లు ఫిల్డ్ అసిస్టెంట్లు పాల్గొని సర్వేలో భాగంగా ఇంటింటికి తిరిగి ఆ ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో తెలుసుకొని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఫోటోలుతో కూడిన తెలంగాణ ప్రభుత్వం సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ మరియు కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అని ముద్రించిన అన్ని స్టిక్కర్లను గోడలకు అతికించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఓ ఇంటికి జూనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ కురుకుంట్ల లత, గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ కటుకం రామచంద్రం వెళ్లి కుటుంబ సర్వే స్టిక్కర్ ను అతికిస్తుండగా ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ ఒక్కొక్క బృందానికి 150 కుటుంబాలను కేటాయించడం జరిగిందని వారికి పూర్తి వివరాలు తెలపడంలో ప్రజలు కుటుంబ సర్వే చేయడానికి మీ ఇంటికి వచ్చే ప్రభుత్వ ఉద్యోగులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఇంటింటికి ఎన్ని కుటుంబాలు ఉన్నాయో తెలుసుకుని స్టిక్కర్లను అతికించే కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఈ నెల 6 నుంచి కుటుంబ సమగ్ర సర్వే మొదలవుతుందని ఆయన తెలిపారు.

## కాపర్ వైర్ దొంగల పట్టివేత - సొత్తు రికవరీ చేసిన జమ్మికుంట పోలీస్




**జమ్మికుంట నవంబర్ 1 (వాయిస్ టుడే):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గా కాలనీలో ఉన్న రైల్వే శాఖకు చెందిన ఒక ప్రైవేటు కాంట్రాక్టర్ గోదాంలో నిల్వ ఉంచిన సుమారు నాలుగున్నర లక్షల విలువ చేసే కాపర్ వైర్ ను నవంబర్ 29వ తేదీన గోదాం సెట్టర్ తాళాలు పగల కొట్టి కాపర్ సుమారు 500 కేజీల వైరును దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను జమ్మికుంట పోలీసులు చాకచక్యంగా 48 గంటల్లో పట్టుకోవడం జరిగిందని సిఐ వీ రవి తెలిపారు. బండావతి సందీప్ అనే వ్యక్తి మరో వ్యక్తి బాలుతో కలిసి నవంబర్ 29న సుమారు 5 లక్షల విలువచేసే కాపరువైరును దొంగతనం చేసి కీసర మండలం నాగారం గ్రామానికి చెందిన హేమ కనకయ్య అనే వ్యక్తికి విక్రయించినట్లు తెలిసింది. దొంగతనం జరిగినట్లు గోడౌన్ ఇంచార్జ్ జగదీష్ దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి సీసీ కెమెరాలు ఆధారంగా దర్యాప్తు చేసి దొంగలను పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను చాకచక్యంగా పట్టుకొని కేసును చేదించిన జమ్మికుంట పట్టణ ఎస్ఐ ఆరోగ్యం, హెడ్ కానిస్టేబుల్ నెల్లి మోహన్, సదయ్య, సంపత్ లతోపాటు కానిస్టేబుల్ వేణు మిగతా సిబ్బందిని సిఐ అభినందించారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
శనివారం, 1 నవంబర్, 2024

# టీజీపీఏ పోరాట ఫలితమే మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంపు

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన టీజీపీఏ రాష్ట్ర కమిటి



**జమ్మికుంట నవంబర్ 1 (వాయు టుడే):** సెప్టెంబర్ 9 రోజున ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ వేదికగా తెలంగాణలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ, జనరల్ గురుకులాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థిని విద్యార్థుల వ్యవస్థాపకులు మోతుకూరు యాదయ్య మాట్లాడుతూ గురుకులాల సమస్యలను పరిష్కరించాలనీ,బోధన,బోధనేతర సిబ్బందిని క్రమబద్ధీకరణ చేయాలనీ, పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ పెండింగ్ జీతాలు, కాంట్రాక్ట్ బిల్లులు, నిరుపేద పిల్లల కాస్మోటిక్ డైట్ చార్జెస్ పెంచాలని పై పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్యతో పాటు, నాణ్యమైన భోజనము, మెరుగైన వైద్యం మౌలిక సదుపాయాలు విద్యార్థులకు అందించాలని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ (టి జి పి ఎ) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పెంచిన మెనూ క్యాటరింగ్ ,కాస్మోటిక్ చార్జీలు అమలు చేయడం తో విద్యార్థులు తల్లిదండ్రులు, టీజీపీఏ సంఘం కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మిగతా బిల్లులు కూడా సకాలంలో చెల్లించాలి అని కోరారు. పది నెలలగా గురుకులాల్లో రకరకాల కారణాలతో చనిపోయిన విద్యార్థులకు ప్రభుత్వం పది లక్షల ఎక్స్రేషియా, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్రమంలో రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ (ప్రభు) రాష్ట్ర ఉపాధ్యక్షులు దార మధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె పవన్ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండ్ర లావణ్య, సభ్యులు యాకయ్య పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరా వర్ధంతి వేడుకలు



**వాయిస్ కూడా ప్రతినిధి బోయినపల్లి నవంబర్ 1:** మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా బోయినపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి వృద్దులకు పండ్ల పంపిణి చేశారు ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మి పతి గౌడ్, మాజీ ఎంపీటీసీ ఉయ్యాలా శ్రీనివాస్ గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగుల వంశీ గౌడ్ , మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఐరెడ్డి రాజ్యలక్ష్మి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు కౌడగాని వెంకటేష్ ,మండల కాంగ్రెస్ నాయకులు ఏనుగుల కానుకయ్య, కట్ట లచ్చయ్య, సంబ లక్ష్మి రాజ్యం, జోగు రవీందర్, పిట్టల రమేష్, జంగ సత్యం,జగిరి శోభన్, ఏనుగుల ప్రశాంత్ , ఎండీ హుస్సేన్, కొలుపుల ప్రవీణ్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గుడి శేఖర్ రెడ్డి, గంగిపెల్లి లచ్చయ్య, మెరుపుల మహేష్, అద్దంకి రమేష్, కళ్లపెల్లి సతీష్, రోమల అజయ్, కాంగ్రెస్ నాయకులు ఎండీ నజీర్, పోరెడ్డి మల్లారెడ్డి, కర్ణాకర్, మహిపాల్ రెడ్డి, రాజేందర్, మండల శ్రీనివాస్, ఎండీ రఫీ, శ్రీనివాస్ రెడ్డి, బోయిని మల్లేశం, జలందర్, కమల్ యాదవ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ నూతన పాలక వర్గానికి సన్మానం



**వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి నవంబర్ 1:** బోయినపల్లి మండలం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి డైరెక్టర్లను గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కట్ట లచ్చయ్య శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచులు ,ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే

సమగ్ర కుటుంబ సర్వేను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి నవంబర్ 1:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను శుక్రవారం బోయినపల్లి లో సందీప్ కుమార్ ఝ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ మరియు కుల సర్వే పై అరా తీసి సమగ్రంగా కుల గణ సర్వే చేయవలసిందిగా తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఇ.ఓ యస్.వినోద్, యం పి డి ఓ బీమా జయ శీల, యం పి ఓ శ్రీధర్ , ఎన్యుమనేటర్స్, సూపర్వేజర్స్ పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు .

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య



**వాయిస్ టుడే తొర్రూరు నవంబరు 1:** ప్రతి విద్యార్థి తరగతి స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన కలిగి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలనికోవాలని తొర్రూరు మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య అన్నారు. జనవిజ్ఞాన వేదిక తొర్రూరు మండల కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్ గౌడ్ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక మండల శాఖ గౌరవ అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు రాయిపల్లి యాకయ్య సమన్వయంతో చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడపత్రికను స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెల్లా లక్ష్మీ నారాయణ,సిడబ్ల్యూసి జిల్లా చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో పరిశీలన,ప్రశ్న,అధ్యయనం, హేతుబద్ధ ఆలోచనలు, వివేచన విచక్షణ శక్తి,పరిశోధన శక్తి,మరియు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం చెకుముకి పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులందరికీ జనవిజ్ఞాన వేదిక ద్వారా వెలువడేటువంటి చెకుముకి పత్రికను చదివి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. 8,9,10 వ తరగతి విద్యార్థులకు చెకుముకి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షలో ఆయా తరగతిలోని విద్యార్థులందరూ పాల్గొనేటట్లుగా ప్రోత్సహించాలని కోరారు. తొర్రూరు మండల అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్ గౌడ్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజల కోసం సైన్స్ ప్రగతి కోసం సైన్స్, సావాలమ్మ కోసం సైన్స్ విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించడానికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో ఫ్రెండ్స్ పై అవగాహన పెంపొందించడానికి పత్రికను అన్ని పాఠశాలలో విద్యార్థుల చేత చదివించడానికి మా సభ్యులందరికీ సహకారంతో ముందుకు పోతామని అన్నారు. ఈ చెకుముకి పరీక్ష పాఠశాల స్థాయిలో నవంబర్ 7న మండల స్థాయి, నవంబర్ 21న జిల్లాస్థాయి,నవంబర్ 28 రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 13 14 15 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కంటాయపాలెం హెచ్ఎం,జెవివి సలహాదారులు తండ ప్రభాకర్, జెవివి ప్రధాన కార్యదర్శి కోటగిరి కుమార్ గౌడ్, కోశాధికారి ఎద్దు వెంకన్న, చెకుముకి కన్వీనర్ పులి ముత్తులింగం,జెవివి బాధ్యులు పెరుమాళ్ళ రమేష్,కుమార్ స్వామి, బ్రహ్మానందరెడ్డి,శ్రీధర్ రెడ్డి లింగమూర్తి,చిరగాని రమేష్, సమతా, కన్వీనర్లు జ్యోతి, రేణుక, దేవి, కవి రాజ్ ఎల్ల గౌడ్, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి రంగోత్సవ్ విజ్ఞాన్ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం




**వాయిస్ టుడే ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 01:** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు గత నెలలో జరిగిన రంగోత్సవ్ పోటీలల్లో జాతీయస్థాయిలో 213 మంది ఎంపికై ప్రభంజనం సృష్టించి శుక్రవారం అవార్డులు సొంతం చేసుకున్నారు. రంగోత్సవ్లో రాణించిన విద్యార్థులకు మండల విద్యాధికారి కృష్ణహరి గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, బ్రౌంజ్ మెడల్, శిల్డ్, మెమోంటో, ప్రశంసపత్రాలను అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కృష్ణహరి మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు. విజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థులు ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలను అందిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం కూడా పదవ తరగతిలో విద్యార్థులు మంచి జిపిఏ సాధించి తల్లి, తండ్రి, గురువుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. కె. సాయినమస్యకు ట్రోఫీ, సైకిల్, బండి బ్లెస్సీ కు స్టడీ ల్యాంప్, అరిబా తస్కిన్, కె. రేషిక, హరిణి, అనిరుద్, పూజ, సంహిత్, ఏంజెల్, నిహాల్, వర్షిణి, మాలవికలకు గోల్డ్ మెడల్, ట్రోఫిలను మండల విద్యాధికారి అందించారు. అనంతరం కరస్పాండెంట్ మహ్మద్ లతీఫ్ మాట్లాడుతూ రంగోత్సవ్ కార్యక్రమంలో తమ పాఠశాల నుండి 1200 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 213 మంది జాతీయస్థాయిలో రెండవ దశకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ యండి లతీఫ్ తెలిపారు. గత సంవత్సరం కూడా రంగోత్సవ్లో తమ విద్యార్థులు ఉ త్తమ ఫలితాలను సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్ కుమార్, సంతోష్ కుమార్, డైరెక్టర్లు నయిమా, అశ్రఫ్, హామిద, మిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి గోవిందరాజుల శతజయంతి అమృతోత్సవాలు

నవంబర్ 4 నుండి 12 వరకు సత్సంగ సదనం 64 వ వార్షికోత్సవ వేడుకలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 01:** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో నవంబర్ 4 వ తేదీ నుండి 12 వరకు శ్రీ సరస్వతి గోవిందరాజుల శతజయంతి అమృతోత్సవాలు సత్సంగ సదనం 64వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సత్సంగ సదనం అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి తెలిపారు. సత్సంగ సదనం వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ సరస్వతి గోవిందరాజుల ఆశీస్సులతో 1960 నుండి ఇప్పటివరకు 12 జిల్లాలలో 1008 గ్రామాల్లో బుద్ధి సంఘములు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వార్షికోత్సవ కరపత్రాలను సత్సంగ సదనం అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి శుక్రవారం తన స్వగృహంలో స్వగ్రామమైన అల్మాస్పూర్ గ్రామంలో భక్త బృందంతో కలిసి ఆవిష్కరించారు ఈ వేడుకలలో కర్మ భక్తి జ్ఞానం గురించి పెద్దలు సత్సంగములు బోధిస్తారు. ఆధ్యాత్మిక పరులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారికి భోజనం వసతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు ప్రభాతభేరి గీతా పారాయణం సూర్య నమస్కారములు సాయంత్రం ఏడు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సత్సంగ సదనం అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి ప్రబోధములు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జగిత్యాల కు చెందిన పండితులు శ్రీ మాన్ నంబి వేణుగోపాల చార్య కౌశిక శ్రీమద్భాగవత సప్తాహము నిర్వహిస్తారు.

# మంత్రి పొన్నం నుకలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మండల నాయకులు

**వాయిస్ టుడే ప్రతిది బోయినపల్లి నవంబర్ 1:** బిసి సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను బోయినపల్లి మండల నాయకులు కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో సన్మానించి మండల సమస్యలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి గౌడ్, నాయకులు సంభ లక్ష్మి రాజం, ఏనుగుల కనకయ్య తదితరులు ఉన్నారు.





రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన అభిమాని బొమ్మరాతి వేణు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయించి, శాలువా కప్పి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వేణుకు ఆయన ఆప్తమిత్రులు జెన్నాయికోడే జగన్మోహన్,మధు,నరేందర్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, వారంతా ఎంపీ రవిచంద్రకు దీపావళి పర్వదినం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.

# ఆటోలో తిరుగుతూ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్



**వాయిస్ టుడే ప్రతినిధి(హుస్నాబాద్)నవంబర్ 01:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో దీపావళి సందర్భంగా వ్యాపారస్తులు యువకులు ,స్థానిక ప్రజలతో ముచ్చటించారు.. పలు కాలనీల్లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష్మి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణ వీధుల్లో తిరుగుతూ మహిళలు ,చిన్న పిల్లలతో ముచ్చటిస్తూ వారికి ఆనందోత్సాహాలతో దీపావళి జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట ఆటోలో సిద్దిపేట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సహకార సంఘం చైర్మన్ బోలిశెట్టి శివయ్య చైర్మన్ బోలిశెట్టి శివయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నంను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**వాయిస్ టుడే ప్రతిది బోయినపల్లి నవంబర్ 1:** బిసి సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు బోయినపల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజే శారు. అనంతరం శాలువాతో సన్మానించి మండల సమస్యలపై చర్చించినట్లు ఏం ఏం సి చైర్మన్ తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి, నాగుల వంశీ గౌడ్, మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఏఎంసీ చైర్మన్ సన్మానించిన బూరుగుపల్లి గ్రామస్తులు



**వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి నవంబర్ 1:** ఇటీవలే నూతనంగా నియామకమైన బోయిన్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, డైరెక్టర్ గంగిపెల్లి లచ్చయ్య లను శుక్రవారం బూరుగుపల్లి లో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ గా నియామకమైన తర్వాత మొదటిసారి బూరుగుపల్లికి వెళ్లడంతో గ్రామపంచాయతీ ఆవరణలో ఘనంగా సన్మానం చేశారు.

## హుస్నాబాద్‌లో దీపావళి సంబురాలు జరుపుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



**వాయిస్ టుడేప్రతినిధి(హుస్నాబాద్ నియోజకవర్గం)నవంబర్ 01:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్. హుస్నాబాద్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన దీపావళి వేడుకల్లో పాల్గొన్నా రు. క్యాంప్ కార్యాలయంలో లక్ష్మి పూజ కార్యక్రమం లో నియోజకవర్గ ముఖ్య నేతలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి టపాకాయలు కాలుస్తూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ వ్యాప్తంగా వ్యాపారస్తులందరికి ఆ లక్ష్మి దేవి కరుణ కటాక్షం ఉండి ఆర్థిక సంక్షోభం నుండి సంపూర్ణంగా అన్ని రకాల పథకాలు అమలు చేసే విధంగా మహా లక్ష్మి పథకానికి ఆటంకం లేకుండా ఆశీర్వాదం ఉండాలని కోరుకున్నారు. తెలంగాణ వచ్చిన తరువాత మొదటి దీపావళి లక్ష్మి దేవి అమ్మవారిని కోరుకుంటున్నమన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలందరు కూడా రాష్ట్ర ప్రజా పాలనలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలంటే ధన లక్ష్మి కటాక్షం అవసరమన్నారు. పరిశ్రమలకు రైతులకు అన్ని రకాల Probability ఎలాంటి ఆటంకం లేకుండా అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని కోరారు .మంత్రి తో పాటు సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి,సీనియర్ నాయకులు బోలిశెట్టి శివయ్య,చిత్తారి పద్మ, జంగపల్లి ఐలయ్య,రవీందర్,పచ్చిమట్ల రాధ, సంజీవ రెడ్డి, మార్క అనిల్ పార్టీ కార్యకర్తలు తదితరులు దీపావళి సంబురాలలో పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేసిన ఏబీవీపీ నాయకులు రోహిత్

### జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్




**కామారెడ్డి వాయిస్ టుడే నవంబర్ 1:** కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గణేష్ అనే పేషంట్ కి తన అనారోగ్యం నిమిత్తం అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో పేషంట్ కుటుంబసభ్యులు కామారెడ్డి జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులను సంప్రదించడంతో ఒక్క ఫోన్ కాల్ తో వెంటనే స్పందించిన ఏబీవీపీ కామారెడ్డి జిల్లా కన్వీనర్ రోహిత్ గారు ఒక ప్రాణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో వెంటనే వచ్చి రక్తం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ కామారెడ్డి జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ దేశసేవ నిమిత్తమై తాను ఎల్లప్పుడూ ఏబీవీపీ కార్యకర్తగా ముందుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి నిర్వాహకులు మాట్లాడుతూ రక్తం దానం చేస్తే మళ్లీ రక్తం వస్తుంది కానీ, రక్తం అందక పోయిన ప్రాణం తిరిగి రాదు.మనం చేసే రక్తదానం వలన వెలకట్టలేని విలువైన ప్రాణం రక్షించబడుతుంది.... యువత మానవత్వంతో స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి ప్రాణదాతలు కావాలని తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా ఒక్క ఫోన్ కాల్ చేయగానే వచ్చి రక్తదానం చేసిన విద్యార్థి నాయకులు రోహిత్ కి జిల్లా రక్తధాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ లు ధన్యవాదాలు తెలిపారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**రామకృష్ణాపూర్ అక్టోబర్ నవంబర్ 1 (వాయిస్ టుడే):** రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన పూర్ణానంద్ కుమార్ సింగ్ గత కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. పూర్ణానంద్ కుమార్ సింగ్ పట్టణంలోని రాజీవ్ చౌక్ లో కిరాణం జనరల్ స్టోర్ షాప్ నడుపుతూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు,కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబం నిస్సహాయ స్థితిలో ఉంది. ఈ విషయం తెలుసుకున్న 1991-92 సింగరేణి హై స్కూల్ లో తనతో పాటు పదవ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుకున్న స్నేహితులు చెల్లించిపోయి తన స్నేహితుని కుటుంబానికి తమ వంతు గా ఏమైనా సహాయం చేయాలని అనుకున్నారు. స్నేహమంటే బ్రతికుండగా చెట్టపట్టాలేసుకొని తిరగడం కాదు స్నేహితులు మరణించిన తర్వాత కూడా తన కుటుంబానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. తనతో పాటు చదువుకున్న మిత్రులందరికీ కలుపుకొని మృతి చెందిన పూర్ణానంద్ కుమార్ సింగ్ పిల్లల చదువుల నిమిత్తం 1,40,000 వేల రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో కూడా తమ వంతుగా ఎలాంటి సహాయ సహకారం కావాలన్నా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని వారికి ధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో స్నేహితులు గురుదాస్ మ్యాజిక్ భాస్కర్ పాల్గొన్నారు.

## మహిళలకు 33% రిజర్వేషన్ అమల చేయూలి -ఐద్వా డిమాండ్

**ముదిగొండ మండలం నవంబర్ 1 వాయిస్ టుడే:** మహిళలకు 33% రిజర్వేషన్ అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శి మందరపు పద్మ, కోలేటి అరుణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దీపావళి పండగ పురస్కరించుకొని మహిళల జీవితాల్లో వెలుగుల నింపాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిరుమర్రి గ్రామంలో శుక్రవారం కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో మహిళలకు మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించింది, తప్ప మిగతా ఏ గ్యారెంటీని అమలు చేయలేదన్నారు. కంప్యూటర్ కాలంలో కూడా మహిళలపై చిన్న చూపు చూస్తూ ఆటవికంగా ప్రవర్తిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు రూ 2500 ఇవ్వాలని,ఇల్లు లేని వారికి ఇల్లు,వడ్డీ లేని రుణాలు నూతనంగా రేషన్ కార్డులు, పెన్షన్లు వెంటనే ప్రజలకు అందే విధంగా చర్యలు చేపట్టాలని లేనియెడల ఆందోళన ఉధృతం చేస్తామని వారిని హెచ్చరించారు. ఈ




కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు వినుకొండ రాణి,సులోచన,చావగాని లలిత,బండి నాగమణి, మల్లెల కళ్యాణి,సంధ్య,శ్రావణి స్రవంతి,నాగమ్మ,ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచల గిరి ప్రదక్షిణ భక్తులకు ఆర్‌టిసి శుభవార్త !

**భద్రాచలం, నవంబర్ 01 (వాయిస్ టు డే):** తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు ఆర్ టి సి శుభవార్త తెలిపింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 15 న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణ కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును భద్రాచలం ఆర్ టి సి డిపో నుండి నడపాలని నిర్ణయించినట్లు డిపో మేనేజర్ బి. తిరుపతి ఒక ప్రకటన లో తెలిపారు. సర్వీసు నంబర్ 55555 గల ఈ బస్సు. నవంబర్ 13 న రాత్రి 8 గంటలకు భద్రాచలం బస్టాండ్ నుండి బయలుదేరి విజయవాడ మీదుగా శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం (గోల్డెన్ టెంపుల్ ) లను దర్శింపచేసి రాత్రి 10 గంటలకు అరుణాచలం చేరును అరుణాచలేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత నవంబర్ 15 వ తేదీ సాయంత్రం 5 గంటలకు బయలుదేరి నవంబర్ 16 వ తేదీ సాయంత్రం 4 గంటలకు భద్రాచలం చేరుకుంటుంది. అరుణాచల గిరి ప్రదర్శనను టూర్ ప్యాకేజీలాగా టీఎస్ఆర్టీసీ అందిస్తోంది. ఈ ప్యాకేజీ ధరను ఒక్కొక్కరికి రూ.4000 గా సంస్థ నిర్ణయించింది. అన్ని సెస్ చార్జీలు, బోర్డర్ టాక్సు మరియు టోలు టాక్సులు కలుపుకొని నాలుగు దేవస్థానము లు కలుపుకొని టూర్ ప్యాకేజీగా అందిస్తుంది పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణ కు భక్తుల రద్దీ దృష్ట్యా భద్రాచలం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును టీఎస్ఆర్టీసీ ఏర్పాటు చేసింది. ఈ సదుపాయాన్ని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులు వినియోగించుకోవాలి. అలాగే అన్నవరం మరియు పంచారామాలకు కూడా కార్తీక మాసంలో వచ్చు అన్నీ ఆదివారం లలో బస్సు లు నడుపబడును.ఈ టూర్ ప్యాకేజీని సంస్థ అధికారిక వెబ్ సైట్ tgsrtcbus.inలో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చులి. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం మరియు చుట్టుపక్కల ప్రాంతాల వారు తమ దగ్గరలోని బస్టాండ్ తో పాటు సమీప టీఎస్ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలోనూ బుక్ చేసుకోవచ్చు. ఈ టూర్ ప్యాకేజీకి సంబందించిన పూర్తి సమాచారం కోసం 7386326102,7382856625 9347797952 ఫోన్ నంబర్లను సంప్రదించాల్సిందిగా ఆర్టిసి భద్రాచలం డిపో మేనేజర్ బి. తిరుపతి కోరారు.

## భ్రమరాంబ పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కొత్తగూడెం:** కొత్తగూడెం పట్టణ ప్రముఖ న్యాయవాది భాగం మాధవరావు మాతృమూర్తి భ్రమరాంబ పార్థివ దేహానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు వాసిరెడ్డి మురళి, న్యాయవాదులు వై ఉదయ భాస్కరరావు, పి రాధాకృష్ణ, కోటం రాజు, ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్, కిరణ్, సునీల్, దుర్గారావు, యుగంధర్, నాయకులు ఉంగరాల సుధాకర్, మిరియాల రాము, గోవిందు, ఉపేందర్, రవి, రామ్ సింగ్, కన్నా, పూర్ణచందర్, హుస్సేన్, నగేష్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు!



**భద్రాచలం, నవంబర్ 01 (వాయిస్ టు డే):** భద్రాచలం లోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కంభంపాటి సురేష్ నివాసం వద్ద శుక్రవారం ఘనంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు కోడాలి శ్రీనివాసన్ మాట్లాడుతూ 2024 - 25 సంవత్సరానికి గాను పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుందని అన్నారు. పార్టీ నాయకులు, కార్ర్యకర్తలు సభ్యత్వ నమోదులో కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలుగు దేశం పార్టీ లింక్ ద్వారా సభ్యత్వం నమోదు చేసుకోవాలని కొడాలి కోరారు. సభ్యత్వం తీసుకున్న సభ్యులకు ప్రమాద భీమా ఐదు లక్షల రూపాయలు తెలుగుదేశం పార్టీ కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రంలో పార్టీ నాయకు లు కుంచాల రాజారామ్, ఎస్ కే అజీమ్, కోనేరు రాము, అబ్బినేని శ్రీనివాస్ , తాళ్ళూరి చిట్టిబాబు, తెలుగు మహిళలు, తెలుగు యువత పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు!



**భద్రాచలం, నవంబర్ 01 (వాయిస్ టు డే):** రాష్ట్ర ప్ర భుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమ ను జయప్రదం చేయాలని ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకటరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్వయంగా సమగ్ర కుటుంబ సర్వే లో పాల్గొన్నారు. సిబ్బంది సర్వే చేస్తున్న తీరు ను ఎంఎల్ఏ పరిశీలించారు. ఈ సందర్భం గా వారికి పలు సూచనలు చేశారు. దుమ్ముగూడెం మండలం సీతారాంపురం గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమం జరుగుతున్న ప్రదేశానికి ఎంఎల్ఏ వెళ్లి సర్వే చేస్తున్న అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్నీ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంఎల్ఏ తెల్లం!



**భద్రాచలం, నవంబర్ 01 (వాయిస్ టుడే):** అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పరామర్శించారు. భద్రాచలం సుభాష్ నగర్ కాలనీలో షేక్ మున్ని అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఎంఎల్ఏ తెల్లం వెంకటరావు పరామర్శించి, వారికి ఆర్థిక సహాయ అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని ఈ సందర్భం గా హామీ ఎంఎల్ఏ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు భీమవరపు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామరెడ్డి వాయిస్ టుడే అక్టోబర్ 1:**శుక్రవారం రోజున పట్టణంలోని వాసవీ హై స్కూల్ సమీపంలోని వార్డులో జరుగుతున్న ఇంటింటి సర్వే ను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రతీ ఇంటిలో నిర్వహించాలని, కుటుంబంలోని ప్రతీ ఒక్కరి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఆ ఇంటిలోని సమాచారాన్ని సేకరించిన అనంతరం స్టిక్కర్ అంటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు



జిల్లాలో 30, 30 (ఎ) పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ సింధూ శర్మ తెలిపారు. శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నవంబర్ 1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ఈ యాక్టు అమలు లో ఉంటుందన్నారు. ఈ యాక్టు ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని కోరారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
శనివారం, 1 నవంబర్, 2024

# రామకోటి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా దీపావళి పూజలు

### చీకటిని ప్రారద్రోలి వెలుగును ప్రసాదించెదే దీపావళి

### భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు



**వాయిస్ టుడే నవంబర్ 1( సిద్దిపేట్ జిల్లా ప్రతినిధి):** దీపావళి లక్ష్మీదేవి పూజలు సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రామకోటి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో చీకటి తొలగిపోయి వెలుగులు విరజిమ్మాలని కోరారు. మన జీవితాల్లో కష్టాలు, బాధలు అనే చీకటులను పారద్రోలి, సంతోషం, ఆనందం అనే వెలుగులు ఈ దీపావళి వల్ల రావాలన్నారు.

# వీసాల విషయంలో మోసం చేసి పారిపోయిన వ్యక్తిని పట్టుకున్న పోలీస్ శాఖ




**కామారెడ్డి వాయిస్ టుడే అక్టోబర్ 1:** కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలోని ఒక వ్యక్తి విదేశాలు వెళ్లడానికి వీసా ఇప్పిస్తానంటూ బాధితుల దగ్గర డబ్బులు ఒక్కొక్కరి వద్ద 1,20,000 వేల రూపాయలు చొప్పున తీసుకొని వారిని మోసం చేసి పరారీ వ్యక్తిపై గత సంవత్సరం రాజంపేట పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశారు. అయితే సుమారు ఒక సంవత్సరం నుంచి పరారీలో ఉన్న ఈ వ్యక్తి గౌడ మల్లేశం దోమకొండ మండలానికి చెందిన వ్యక్తిని రాజంపేట పోలీసు వారు గుర్తించి పేరు మార్చుకుని పాల్వంచ కొత్తగూడెంలో ఇదే తరహా దందా చేస్తున్న వ్యక్తిని పట్టుకొని జ్యుడీషియల్ రిమాండ్ కొరకు జైలుకు తరలించారు. ఈ కేసు చేయించడంలో పరారీలో ఉన్న వ్యక్తిని పట్టుకోవడంలో కృషిచేసిన కానిస్టేబుల్స్ శ్రీనివాస్ రాజేష్ రవీందర్‌ను అభినందిస్తున్నారు.

# మండల వ్యాప్తంగా బిజెపి సభ్యత్వ నమోదు



**వాయిస్ టుడే ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 1:** ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మారుమూల ప్రాంతాలైన కేశవాపురం, చీపురుదుబ్బ, నిమ్మగూడెం, తక్కెళ్ళగూడెం పరిసర ప్రాంతాలలో గల పిట్టతోగు వంటి గుత్తకోయగూడాల్లో సభ్యత్వ డ్రైవ్ నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొల్లి కొండ సాంబయ్య మాట్లాడుతూ ఈరోజు మారుమూల ప్రాంతాలలో కూడా సభ్యత్వాలు చేయగలుగుతున్నామంటే దేశంలో నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు దేశం పైన ప్రజలపైన మోడి కి ఉన్న ప్రేమే ఇందుకు నిదర్శనం అని అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, మరియు బీజేపీని మోడీ ప్రభుత్వాన్ని ఇంకా బలపరచి దేశ అభ్భ్రుద్ధిలో భాగస్వామ్యులు కావాలని మండలం లోని బీజేపీ కార్యకర్తలు నాయకులు ప్రతి ఒక్కరు రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు కోసం కష్టపడి అత్యధిక సీట్లు బిజెపి అభ్యర్థులు గెలవడానికి కృషిచేసి ఎన్నికల సమరంలో సిద్ధంగా ఉండి సత్తా చాటాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రావుల జానకిరావు సోషల్ మీడియా ఇంచార్జ్ ఎంబటి నవీన్ బూత్ అధ్యక్షుడు మూతి రవి తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ సెక్రెటరీ



**వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా నవంబర్.1:** నవాబు పేట్ మండలం సిద్దోటం గ్రామంలోని ఎస్సీ కాలిని లోని మట్టి రోడ్లు బుర్జమట్టిలా మారాయి. ఈ విషయంపై పంచాయతీ సెక్రటరీకి పదే పదే చెప్పిన పట్టించుకోవడంలేదని ప్రతిరోజు చేసే పరిశుద్ధ కార్యకలాపాలు కూడా ఎస్సీ కాలనీలో చేయడం లేదని కాలనీవాసులు చెప్తున్నారు మరి కాలనీపై ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నాడని చర్చనీయంగా మారింది. సిద్దోటం గ్రామంలోని కొన్ని వార్డులలో పనిచేస్తూ ఎస్సీ కాలనీకి వాడుకొచ్చే వరకు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆ ఆ కాలనీ వాసులు చెప్తున్నారు ఈ విషయంపై పంచాయతీ సెక్రెటరీ వెంటనే చర్యలు తీసుకొని పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు

# నవంబర్ 3న జరిగే ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనంను విజయవంతం చేయండి

### (డి.ఎస్.పి)రాష్ట్ర కార్యదర్శి కర్రోల్ల రవిబాబు



**వాయిస్ టుడే నవంబర్ 1( సిద్ధిపేట్ జిల్లా ప్రతినిధి):** ధర్మ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ( డి.ఎస్.పి ) పార్టీ మొదటి మహా సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్రోల్ల రవిబాబు మాట్లాడుతూ( డి.ఎస్.పి )పార్టీ ఆవిర్భవించి ఒక సంవత్సరం పూర్తి చేసుకున్నందున హైదారాబాద్ లోని ఆదిభట్లలో నవంబర్ 3 వ తేదీన మొదటి ఆవిర్భావ మహా సమ్మేళనం జరుపుకుంటున్నామని, ఈ కార్యక్రమానికి పది వేల మంది హాజరవుతారని అన్నారు...ఈ సభను బీసీ, ఎస్సి, ఎస్ టి, డీ ఎఫ్ సి, డీ ఎన్ టి, రిలీజియన్ మైనార్టీ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు.అలాగే రాష్ట్రంలో అగ్ర వర్ణ, పెట్టుబడి దారి,నిరంకుశత్వ, పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ మనువాదాన్ని, మత విద్వేషాలను పెంచి పోషిస్తూ దేశ ప్రజలను నిత్యం అజ్ఞానంలో, మూఢత్వంలో ముంచుతున్న బీజేపీ పార్టీ పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ మరియు ప్రభుత్వ రంగ సంస్థలైన బీ ఎస్ ఎన్ ఎల్, ఎల్ ఐ సి, రైల్వేలు, సింగరేణి లను ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేస్తూ,ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నాయని, కేంద్రం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాల యాపన చేస్తూ ఉన్నాయని, 40 లక్షల ఓబీసీ, ఎస్సి, ఎస్టీ మరియు వికలాంగుల బ్యాకలాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నా కూడా భర్తీ చేయకుండా దేశంలో నిరుద్యోగులను పెంచుతూ ఉన్నాయని అన్నారు. పది సంవత్సరాలు తెలంగాణను తెగ దోపిడీ చేసిన బీ ఆర్ ఎస్ పార్టీ పై రెండు పార్టీలను ప్రశ్నించలేని పరిస్థితిలో కొట్టు మిట్టాడుతున్నదనీ అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్న ఏకైక పార్టీ ధర్మ సమాజ్ పార్టీ మాత్రమే అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు, మంద జ్యోతి,జిల్లా ఉపాధ్యక్షులు ర్యాగట్ల చందు,ప్రధాన కార్యదర్శి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ది నయవంచన పాలన...!

### బిఆర్ఎస్ పార్టీ నాయకులు దాచారం కనకయ్య



**వాయిస్ టుడే నవంబర్ 1(సిద్దిపేట జిల్లా ప్రతినిధి):** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ తెలంగాణ లో కాంగ్రెస్ నయవంచన పాలన కొనసాగుతుందని మండల టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ దాచారం కనకయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 11 నెలల రేవంత్ రెడ్డి పాలన చూస్తే ప్రజా పాలన కాదు.. ప్రజా పీడనగా కనబడుతుందని మండల బి అర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాచారం కనకయ్య ధ్వజమెత్తారు. ప్రజా పాలన తొలిగిపోయి కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయటలైందని, ఏ వర్గానికి తామిచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందన్నారు. సీఎం వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారని, రాష్ట్రంలో ఎక్కడా చూసినా ధర్నాలతో అట్టుడికి పోతోందని మండిపడ్డారు. నోటికి వచ్చినట్లు మాత్రమే మాట్లడమే సీఎంకు తెలుసు అని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. అడిగితే నోటికి ఇష్టం వచ్చినట్లు తిడుతున్నాడన్నారు. కొత్త హామీలు కాదు.. కేసీఆర్ పేదల కోసం మానవీయ కోణంలో ప్రారంభించిన పథకాలను కొనసాగించలేకపోతున్నారని మండిపడ్డారు. రైతు కోసం ఎకరానికి ఏటా రైతుబంధు 10 వేలు ఇచ్చామని, ఒక్క పంటకు కూడా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. బతుకమ్మ చీరలు లేవు, రైతు బంధు లేదు...రుణమాఫీ కాలేదు...పంటలు కొనే దిక్కు లేదు అని అన్నారు. పత్తి ఎక్కడైనా కొనుగోలు చేశారా? అని నిలదీశారు. కింటల్. 7521 ఏంఎస్పీ అని చెప్పి మోసం చేశారని, దీంతో కింటల్ 5వేలకు అమ్ముకుంటున్నారన్నారు. బోనస్ అని చెప్పి బోగస్ అయిందన్నారు. మక్కల కొనుగోలు ప్రారంభం కాలేదని, రైస్ మిల్లులతో ఇంకా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోలేదన్నారు. సోయాబిన్ కొనుగోలు చేయడం లేదని, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ లో రైతులు రోడ్డెక్కారన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి మోసం చేశారన్నారు. “నిరుద్యోగుల హామీ ఏమైందని నిలదీశారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు అని కనీసం 20 వేల ఉద్యోగాల కన్నా నోటిఫికేషన్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, విద్యార్థి భరోసా కార్డు అని కాంగ్రెస్ మోసం చేసిందని, నయాపైసా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదని, విద్యార్థుల బతుకులు ఆగం అవుతుంటే మొద్దు నిద్ర పోతున్నారని మండిపడ్డారు. తక్షణం పెండింగ్ డీఏలు, పీ ఆర్ సీ అని చెప్పి ఉద్యోగులను సీఎం మోసం చేశారన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు దేశంలోనే పైసలు ఇవ్వని ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని దుయ్యబట్టారు. 317 జీవోకు పరిష్కారం చేయలేదన్నారు. ఉసురు పోసుకుని వర్గాలు ఏమైనా ఉన్నాయా? రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. ప్రతిపక్షం బీఆర్ఎస్ పై దాడులు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ముఖ్యమంత్రికి మెదడు నిండా విషం తప్ప.. విజన్ లేదని ఎద్దేవా చేశారు. అవగాహన లేక, పరిపాలన రాక రాష్ట్రాన్ని దివాలా తీశావు అని, మేము పోరాటం చేస్తుంటే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నావని, రుణమాఫీ గురించి మాట్లాడితే వికృతంగా మాట్లాడారని అన్నారు. రుణమాఫీపై ప్రశ్నించినందుకు రేవంత్ రెడ్డి తనను బాడీ షేమింగ్ చేశారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి చేతకానితనం వల్లే తెలంగాణ ఆదాయం పడిపోయిందని ఆరోపించారు. మూసి అక్రమాలు బట్టబయలు చేసే ప్రయత్నం చేస్తే కేటీఆర్ పై మీద దాడి చేస్తున్నావు.. కుటుంబ సభ్యులను అడ్డం పెట్టుకొని పోరాటం చేస్తున్నావు అని సీఎంపై మండిపడ్డారు. మూసి అభివృద్ధికి కాదు, అవినీతి వ్యతిరేకం అని కేటీఆర్ చెప్పారన్నారు. బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని, కేటీఆర్ క్యారెక్టర్ దెబ్బ తీసే యత్నం చేయడం కరెక్ట్ కాదన్నారు.” “కేటీఆర్ బావమరిది ఫ్యామిలీ ఫంక్షన్ చేస్తే తప్పుగా ప్రచారం చేస్తున్నారని, రేవ్ పార్టీ జరగకముందే అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, రేవ్ పార్టీల్లో కుటుంబ సభ్యులు ఉంటారా..? దీపావళి పండుగ జరుపుకుంటే దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాంహౌస్ ఘటన వెనుక రేవంత్ ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. అది ఫాంహౌస్ కాదు.. రాజ్ పాకాల కొత్త ఇల్లు అని తేల్చి చెప్పారు. రేవ్ పార్టీ అని కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. తనిఖీలు చేసిన అధికారులే ఏమి దొరకలేదని చెప్పారని, దురదృష్టవశాత్తు కొన్ని మీడియాలు జరగంది, జరిగినట్లు ప్రచారం చేయడం బాధాకరం అన్నారు.మా అభిప్రాయాలు తీసుకోకుండా మంచిది కాదు... మీడియా ఆలోచించాలని కోరారు. కేటీఆర్ ప్రజల సమస్యల మీద కొట్లాడితే, కక్ష తీర్చుకునే విధంగా ప్రభుత్వం చూస్తున్నదన్నారు. కాంగ్రెస్ ఎంత భయపెట్టిన మేము పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. మూసి అభివృద్ధి ప్రారంభించిందే కేసీఆర్ అని, గోదావరి నీళ్ళు ముసికి తెచ్చే ప్రయత్నం చేసిందే ఆయన అని స్పష్టం చేశారు. మూసి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం, అరాచకాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడతాం అంటే సహించబోమన్నారు. పోలీసులు తమ కుటుంబ సభ్యులను తామే అరెస్టు చేసే ప్రయత్నం జరుగుతుందని, కాంగ్రెస్ నాయకులు తమను తామే చంపుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఏక్ పోలీస్ విధానం అమలు చేస్తామని చెప్పి సెలవులు అడిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 39 మందిని సస్పెండ్, 10మందిని డిస్మిస్ చేశారని, పండగ పూట వారిని ఎందుకు ఏడిపిస్తున్నావ్ అని నిలదీశారు. కంటికి రెప్పలా కాపాడుతున్న వారిపై ఎందుకు అంత కక్ష అని, కిరాయి మూకలుగా పోలీసులను ట్రీట్ చేస్తున్నారని మండిపడ్డారు. రక్షక భటుల రక్షణ లేని రాక్షస పాలన ఈ రాష్ట్రంలో నడుస్తోందన్నారు.”నేరస్తుడు పాలకుడు అయితే రేవంత్ పాలన లాగా ఉంటుందన్నారు. ‘పోలీసు పాలన అంటారు.. మరి పోలీసుల మీద నిర్బంధం ప్రయోగిస్తే ఏమంటారు... రేవంత్ రెడ్డి పాలన అంటారు’ అని ఎద్దేవా చేశారు. పోలీసులే రోడ్డు మీదకు రావటం చరిత్రలో మెదటసారి అని గుర్తుచేశారు. పండుగ, పెళ్లిళ్ల సీజన్ లో ఎవరైనా 144 సెక్షన్ పెడుతారా? అని నిలదీశారు. బట్టలు కొనొద్దు, ఫంక్షన్ షాపింగ్ చేయవద్దా? అని ప్రశ్నించారు. రజాకర్ రాజ్యం లెక్కనే రేవంత్ పాలన ఉందని దుయ్యబట్టారు. ప్రజలు అంటే రేవంత్ కు ఎందుకు అంత భయం అని ప్రశ్నించారు. అనాలోచిత తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. కంచెలు లేని పాలన అని ఆంక్షల పాలన తెచ్చారని ధ్వజమెత్తారు. వ్యతిరేక వస్తుంటే సమాధానం చెప్పలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ప్రజలు అమాయకులు కాదన్నారు. అశోక్ నగర్ ను శోక నగర్ గా మార్చింది రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. “ఏ ఊరైనా పోదాం సన్నవడ్లు కొంటున్నారా? ఏ మూలన పత్తి కొన్నారా? వరంగల్, ఖమ్మం పత్తి మార్కెట్ పోదామా’ అని సవాల్ చేశారు. మీడియాకు లీకులు ఇస్తూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. బండి సంజయ్ ఆయన స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తానా అంటే.. బండి సంజయ్ తందానా అంటున్నారని విమర్శలు చేశారు. బాధ్యత కలిగిన పదవీలో ఉండి బండి సంజయ్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హెూం శాఖ మీదే వాస్తవాలు తెల్సుకుని మాట్లాడాలని, బాధ్యత పదవిలో ఉంది అవాస్తవాలు మాట్లాడటం కరెక్టేనా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తరుపున బండి సంజయ్ వకాల్తా పుచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ కేంద్ర సహాయ మంత్రిగా కాదు, రేవంత్ రెడ్డికి సహాయ మంత్రిగా పని చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందా.. ‘ఆర్ఎస్’ బ్రదర్స్ ప్రభుత్వం నడుస్తోందా.. అని విమర్శించారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సహాయమంత్రిగా పనిచేస్తున్నారని విమర్శలు చేశారు. ప్రజల సమస్యల గురించి ఏనాడు మాట్లాడడు... మేనిఫెస్టో గురించి మాట్లాడడు కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వ మంచి కోరుతాడన్నారు. రామన్నపేట సిమెంట్ ఫ్యాక్టరీ గురించిబీఆరెస్ కొట్లాడితే బీజేపీ ఎందుకు మౌనం అని ప్రశ్నించారు. పోలీసుల సమస్యలపై ఎందుకు మాట్లాడరన్నారు. రేవంత్ రెడ్డి అదిగో పులి అంటే, బండి సంజయ్ అదిగో తోక అంటున్నాడని దుయ్యబట్టారు. కేంద్రం నుంచి ఉపాధిహామీ నిధులు 1500కోట్లు, 15వ ఆర్థికసంఘం నుంచి 500కోట్లు, 300 కోట్లు నేషనల్ హెల్త్ మిషన్ నుంచి వచ్చాయని వాటిని దేనికి ఖర్చుపెట్టారని ప్రశ్నించారన్నారు. మూసీ విషయంలో నల్లగొండ రైతులతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా కుటుంబాలకు గుర్తింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే నవంబర్ 1:** ఈనెల 6 నుండి మొదలయ్యే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం పాల్వంచ మండలం పునుకుల గ్రామంలో నిర్వహిస్తున్న కుటుంబాలకు గుర్తింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొని ఎన్యుమరేటర్లకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి ఒక్క ఎన్యూమరేటర్ వారికీ కేటాయించిన బ్లాక్ ప్రకారముగా ప్రతి ఇంటిని ప్రతి కుటుంబము ను గుర్తించాలని, ఈరోజు నుండి 3 వ తేదీ వరకు ఇట్టి ఇంటి గుర్తింపును పూర్తి చేసి ప్రతి కుటుంబము న కు హౌస్ లిస్టింగ్ స్టికర్ ను అతికించాలని తెలియచేసినారు. ఎన్యూమరేటర్లు తు.చ తప్పక ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని నింపాల్సి ఉంటుందని అన్నారు. ప్రతి ఇంటి నుండి స్పష్టత కల్గిన ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు.ఈ సర్వే ఉద్దేశ్యం రాష్ట్రము లోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కొరకై వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ అవకాశములు మెరుగు పరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేయడం వాటిని అమలు చేయడం ప్రభుత్వ లక్ష్యమని ప్రజలకు తెలియ చేసి అందరు ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనేలా చేయాలి అని తెలియ చేసినారు. ఎన్యుమారెటర్లు సర్వే చేయుటకు తీసుకోవాలసిన జాగ్రత్తలు,సూచనలు తెలియచేసినారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె విజయ భాస్కర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి బి నారాయణ, పంచాయతీ కార్యదర్శి బి బాబూరావు, అంగన్వాడీ టీచర్లు,ప్రజలు పాల్గొన్నారు.

# కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ వీడ్కోలు సన్మానం చేశారు



**కామరెడ్డి వాయిస్ టుడే అక్టోబర్ 1** కామారెడ్డి మున్సిపాల్ కమిషనర్ గా పనిచేసినా సుజాతా బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపాలిటీకి వెళ్లిన సందర్భాంగా ఈరోజు వారికి వీడ్కోలు పలుకుతూ సన్మానం చేస్తున్న కామారెడ్డి మున్సిపల్ BRS పార్టీ కౌన్సిలర్లు హఫీజ్ బేగ్, నజీరోద్దీన్, పిట్ల వేణుగోపాల్, గెరిగంటి స్వప్న లక్ష్మినారాయణ తదితరులు.

# శ్రీ.శ్రీ. కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు రేవంత్ రెడ్డి ఆహ్వాన పత్రం



**వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా నవంబర్ 1:** దేవరకద్ర నియోజకవర్గం శ్రీశ్రీ కురుమూర్తి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానం పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో జి. మధుసూదన్ రెడ్డి, శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్, ఈవో, అర్చకుల బృందం మరియు మక్తల్ ఎమ్మెల్యే . వాకిటి. శ్రీహరి , టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ . అరవింద్ రెడ్డి , తదితర కాంగ్రెస్ నాయకులు కలసి కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ. పత్రికను అందజేశారు.

# ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి ఘనస్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ క్యాడర్



**వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:** విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ కు చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లండన్ పర్యటన ముగించుకొని గురువారం రోజు సాయంత్రం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కి చేరుకు న్నారు. దీంతో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని ఆలేరు నియోజకవర్గ మరియు రాష్ట్రంలోని పలు ప్రాంతల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు. ఆత్మీయులు పెద్ద ఎత్తున్న ఘనస్వాగతం పలికారు. అక్టోబర్ 21 సోమవారం రోజు సాయంత్రం లండన్ బయలుదేరి అక్కడ పలు ప్రాంతాలను సందర్శించారు.లండన్ పార్లమెంట్, థేమ్స్ నదిని, భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ నివాసమున్న గృహాన్ని సందర్శించారు. వ్యక్తి గత పర్యటన ముగించుకుని కుటుంబ సభ్యుల తో అక్టోబర్ 31గురువారం రోజు సాయంత్రం హైదరాబాద్ కు చేరుకున్నారు.ఈ సంద ర్భంగా బీర్ల ఐలయ్యకి కాంగ్రెస్ పార్టీ క్యాడర్,అభిమానులు ఘనస్వాగతం పలికారు.

# యాదాద్రి కొండ పై సంస్కృతిక కార్యక్రమాలు.



**వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:** శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దివ్య క్షేత్రం ఆవరణలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.శ్రీ భవాని క్లాసిక్ డ్యాన్స్ అకాడమి పేరిణి నృత్య సిద్దిపేట వారిచే ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఆహూతులను అలరించారు.

# ఉదయ్ కుమార్ పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య..



**వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:** కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దూడల ఉదయ కుమార్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందారు.స్వస్థలం ఆలేరు మండలం శారజీపేట. పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య..వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు..

# చెన్నూరు నియోజకవర్గంలో 500 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

## వచ్చే ఏడాదిలో నియోజకవర్గ రూపు రేఖలు మారనున్నాయి: వివేక్ వెంకటస్వామి



**మందమర్రి నవంబర్ 1 (వాయిస్ టుడే):** చెన్నూరు నియోజకవర్గంలో 500 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించినట్లుగా, వచ్చే ఏడాదిలో చెన్నూరు నియోజకవర్గ రూపు రేఖలు మారనున్నాయని, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని రామన్ కాలనీ ప్రాంతంలో ఆర్.ఓ.బి బ్రిడ్జిపై 40 లక్షలతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి ప్రజలకు దీపావళి కానుకగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, పట్టణంలో ఎక్కడైతే సెంట్రల్ లైటింగ్ అవసరమో అక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే రోడ్డు డ్రైనేజ్ పనులు ప్రారంభించామని, ప్రతి వార్డులో ఎక్కడ ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మందమర్రి లో ఇప్పటికే 108, 102 అంబులెన్స్ అందుబాటులో ఉన్నాయని, మరొకటి కూడా ఏర్పాటు చేస్తామని,ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు పేదలకు వైద్యం అందుతుందని, రాజీవ్ ఆరోగ్యశ్రీని అందరూ ఉపయోగించుకోవాని,ప్రవేట్ ఆసుపత్రిలో వృధా ఖర్చు చేయకూడదని అన్నారు. అర్హులైన పేదలందరికీ పారదర్శకంగా ఇందిరమ్మ ఇల్లు అందించేం దుకు ఇందిరమ్మ కమిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం వేసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణ్ ,పట్టణ మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రతిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలి

## సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ



**వాయిస్ టుడే నవంబర్ 1( సిద్దిపేట జిల్లా ప్రతినిధి):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి. అనురాధ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తుపదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని,మహిళల, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలన్నారు.ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని, నీతి నిజాయితీగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. విసబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలని ప్రతిరోజు ఉదయం సాయంత్రం సంతలు జరిగే రోజున, తప్పకుండా యూనిఫాంలో ప్రజలకు కనబడాలని,ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు.హుస్నాబాద్ పట్టణం చేర్యాల పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళల పిల్లల రక్షణకు షీ టీమ్స్ ప్రోగ్రాంలో అధికారులు తప్పకుండా పాల్గొని అవగాహన కల్పించాలని తెలిపారు. విపిఓ వ్యవస్థను మెరుగుపరచాలి వారంలో మూడు నాలుగు సార్లు గ్రామాలను సందర్శించే విధంగా ప్లాన్ ఆఫ్ యాక్షన్ రెడీ చేసుకోవాలని సూచించారు. బెల్ట్ షాపులపై నిఘా పెంచాలి, పోక్సో క్రైమ్ అగ్నెస్ట్ ఉమెన్ కేసులలో సత్వరమే స్పందించి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ పోలీస్ సింగ్ లో భాగంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ప్రతిరోజు మానిటర్ చేసి పనిచేయని సీసీ కెమెరాలు వారం రోజులలో రిపేర్ చేయించాలని సూచించారు. సిసిటిఎన్ఎస్ లో ఏ రోజు డాటా ఆరోజు అప్లోడ్ చేయాలని పెండింగ్ పెట్టవద్దని సూచించారు. తరచుగా బెల్ట్ షాప్ నిర్వహించే వారిని బైండోవర్ చేయాలని సూచించారు. నేరాలు, రోడ్డు ప్రమాదాలు, జరుగు ప్రదేశాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వాటిపై నిఘా పెట్టి సహమూలంగా నిర్మూలించాలని సూచించారు. బ్లాక్ స్పోర్ట్స్ హాట్స్పాట్ ను తరచుగా సందర్శించాలని తెలిపారు. నిజాయితీగా విధులు నిర్వహించని అధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సమావేశంలో హుస్నాబాద్ ఎసిపి సతీష్, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, చేర్యాల సిఐ శ్రీను, ఎస్సై ఇన్స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్ గౌడ్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐలు మహేష్, రాజు, విజయ్ భాస్కర్, షేక్ మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేయడం కోసమే కేటీఆర్ పాదయాత్ర- ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: తెలంగాణలో కేటీఆర్ పాదయాత్ర చేస్తానని చేసిన ప్రకటన పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుక్రవారం యాదగిరిగుట్ట లో మాట్లాడుతూ కేటీఆర్ కు పాదయాత్ర చేయవలసిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.అసలు పాదయాత్ర చేయమని ఆయనని అడిగింది ఎవరు అని ప్రశ్నించారు.పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు యాత్ర లు కేసీఆర్, కేటీఆర్ చేయలేదన్నారు.కేసీఆర్ పధియేళ్లుగా ముఖ్యమంత్రి గా ఉండి జిల్లాల పర్యటనకు వెళ్లలేదన్నారు.బస్సు వేసుకొని వస్తానని బడాయి కబుర్లు చెప్పడం తప్ప ఏ నాడు ప్రజల దగ్గరకి వెళ్లలేదన్నారు. అధికారం పోగానే ఇప్పుడు నీకు, నీ అయ్యకు యాత్ర లు గుర్తుకు వచ్చాయా.అని ప్రశ్నించారు.మా ప్రజా ప్రభుత్వం వచ్చిన కొద్దిరోజులకే ప్రజావ్యతిరేకత అంటు పాదయాత్ర చేస్తానని అంటున్నవా సిగ్గుండాలి కేటీఆర్ అన్నారు.ప్రతిపక్ష నాయకుడిగా ఉండాలని జనం మిమ్మల్ని ఇంట్లో కుర్చీ పెడితే మీ అయ్య ఫామ్ హౌస్ లో పడుకున్నడు.ముందు మీ అయ్య ను పామ్ హౌస్ యాత్ర నుంచి బయటకు తీసుకొని రా అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తుందన్నారు. తెలంగాణలో రైతులకు రుణమాఫీ చేశామని,ఇందిరమ్మ ఇళ్ల ఇస్తున్నాము, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాం, మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కల్పించా మన్నారు. ఐదు వందలకే గ్యాస్ అందిస్తున్నా మన్నారు ఇవి ప్రజాలలు తెలుపెందుకు మాత్రమే పాదయాత్ర చేయలన్నారు. కానీ తెలంగాణా ప్రజలను మోసం చేసేందుకు డ్రామారావు ని పాదయాత్ర అవసరం లేదన్నారు. మీరు అధికారం లో ఉన్నపుడు కనీసం ఒక్క రోజు కూడా ప్రజలను పలుకరించే దిక్కు లేదన్నారు.కేటీఆర్ పాదయాత్ర అంటు అప్పుడే జనాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నవా అని మండిపడ్డారు.నువ్వు పాదయాత్ర ప్రకటన ఎందుకు చేశావో ప్రజలందరికి తెలుసన్నారు. కేసీఆర్ తర్వాత బీఆర్ఎస్ నాయకుడిని నేనే,ప్రతిపక్ష హోదా నాకే రావాలని అని చెప్పుకోవడానికే పాద యాత్ర చేస్తున్నట్లు కొత్త కథ కట్టావా అని అన్నారు. హరీష్ రావు ను కంట్రోల్ చేయడం కోసమే ఎత్తులు వేస్తున్నావని,మీ పాదయాత్ర ఐడియా లు ప్రజలపైన ప్రేమతో కాదు.. హరీష్ రావు పైన ఉన్న ద్వేషంతో అని కుండ బద్దలు కొట్టారు.రేవంత్ రెడ్డి లాగా, బట్టివిక్రమార్క లాగా ప్రజల కోసం పాదయాత్ర చేస్తే జనం నీరాజనాలు పడుతారన్నారు. పనికి మాలిన ఆలోచనలు ఆపి బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషించండి అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మండిపడ్డారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ల అందజేత



**ముదిగొండ మండలం నవంబర్ 1 వాయిస్ టుడే** పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్ లను భాదితులకు అందచేసిన ముదిగొండ పోలీసులు ముదిగొండ మండలంలో మేడేపల్లి కి చెందిన పగిల్ల భూలక్ష్మి, ముదిగొండకు చెందిన దోమల జగదీశ్ మరియు అద్దంకి రమేష్ లు వారియొక్క మొబైల్ ఫోన్ లను వివిధ ప్రదేశాలలో పోగొట్టుకోగా వాటిని సీఈఐఆర్ వెబ్ సైట్ నందు అప్లోడ్ చేసి, సీఈఐఆర్ వెబ్ సైట్ ద్వారా మొబైల్ ఫోన్ లు ఆచూకి కనుగొని అవి వాడుతున్న వారి దగ్గరనుండి సెల్ ఫోన్ లను రికవరీ చేసి సెల్ ఫోన్ లు పోగొట్టుకున్న ముగ్గురు బాధితులకు శనివారం ముదిగొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఓ.మురళి, ఎస్ఐ నరేష్ పోలీస్ స్టేషన్ కు పిలిపించి వారి మొబైల్ ఫోన్ లను అందచేసారు.. ఈ సందర్భంగా సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ముదిగొండ పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

## 53వ జన్మదినం సందర్భంగా 53 మంది దాతలు...



**మక్తల్ నవంబర్ 1 వైస్ టుడే ప్రతినిధి:** మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదిన పురస్కరించుకొని ఆయన చిన్ననాటి మిత్రులు ఆధ్వర్యంలో మక్తల్ లోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే 53వ జన్మదిన సందర్భంగా 53 మంది రక్తదానం చేసినట్టు ఆత్మీయ మిత్ర బృందం తెలిపారు. అనంతరం డిఎంహెచ్ఓ డాక్టర్ సౌభాగ్య లక్ష్మి చేతుల మీదుగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిన్ననాటి మిత్రులు సీఎన్ మూర్తి, గణేశ్ కుమార్, కావలి శ్రీనివాసులు, సోమశేఖర్ గౌడ్, గోవర్ధన్, ఆమ్మన్న, నరేందర్ రెడ్డి, బోడ్కె శ్రీకాంత్, చిన్న కొండయ్య, వాకిటి శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, కాడ్గి సత్యనారాయణ, చిన్న వెంకటేష్, తిరుపతి సత్యనారాయణ, సొంత శ్రీకాంత్, గోల్డ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి పండుగ జరుపుకున్న రామకోటి రామరాజు



**వాయిస్ టుడే నవంబర్ 1 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ):** దీపావళి పండుగను భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు కుటుంబం సభ్యులతో గజ్వేల్ పట్టణంలో ఆనందంగా జరుపుకు న్నారు. నరకసూరుణ్ణి వదించిన మరుసటి రోజు జరుపుకునే దీపావళి. ప్రతి ఒక్కరి జీవితం వెలుగులతో విరజిల్లాలని అయన ఆకాక్షించారు.

# అస్వస్థత బాధితులు కు మెరుగైన వైద్యం అందించాలి: ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



**అనంత పురం నవంబర్ 01 వాయిస్ టుడే: శింగనమల నియోజకవర్గము:** బుక్కరాయసముద్రం మండలం, వడియంపేట దగ్గర కర్పూరం ఫ్యాక్టరీలో జరీగిన సంఘటనలో కార్మికులు అస్వస్థతకు గురికావడం చాలా బాధాకరమని నియోజవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణిశ్రీ మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం వైద్యుల సలహామేరకు బెంగళూరు, హైదరాబాద్ మహా నగరాల్లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు కార్మికులు ను తరలించి, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికుల కుటుం బాలకు అన్ని విధాలుగా బాధ్యత వహించాలని సూచించారు.

# ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి



**మక్తల్ నవంబర్ 1 వాయిస్ టుడే ప్రతినిధి:** జన్మదినం పురస్కరించు కుని సీఎం రేవంత్ రెడ్డిని మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్... ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని శాలువా కప్పి, తిరుపతి లడ్డు ప్రసాదం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని, కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయ ఓనమాలు ప్రారంభించి, ముప్పై ఏళ్ళ కు పైగా కాంగ్రెస్ పార్టీకి సేవలు చేశారని, కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని ఉన్నవారికి పార్టీ అండగా ఉంటుందని చెప్పడానికి వాకిటి శ్రీహరి నిదర్శమని అన్నారు. చాలా మందికి వాకిటి శ్రీహరి లాంటి వాళ్ళు ఆదర్శంగా నిలుస్తారని, భవిష్యత్ లో వాకిటి శ్రీహరి మరింత ఉన్నతా స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు.